ప్రజాశక్తి
ఆదివారం 16 జులై 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



పల్లెలకు తప్పని తిప్పలు

- 15వ ఆర్థిక సంఘం నిధులు ఇపిడిసిఎల్‌కు జమ
- మిగిలిన డబ్బు పంచాయతీలకు
- మౌలికసదుపాయాలు కల్పించలేమంటున్న సర్పంచులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

పల్లెలకు తిప్పలు తప్పడంలేదు. పంచాయతీలపై ప్రభుత్వ జోక్యం తగ్గడంలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులను డిస్కాంకు చెల్లించేందుకు తొలి ప్రాధాన్యతనిస్తోంది. మిగిలిన సొమ్మును పంచాయతీ ఖాతాల్లో జమచేస్తోంది. 15వ ఆర్థిక సంఘం నిధులొస్తే గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించి, కొత్తగా కొన్ని పనులు చేపట్టవచ్చుననుకొనే సర్పంచులకు ప్రభుత్వ నిర్ణయం తీవ్ర నిరాశను మిగిల్చింది. 2022-23 ఆర్థిక సంవత్సరం తొలి దశ కింద 15వ ఆర్థిక సంఘం నిధులు టైడ్, అన్‌టైడ్ కింద అనకాపల్లి జిల్లాకు రూ.29.19 కోట్లు విడుదలైంది. ఈ నిధుల్లో పంచాయతీల విద్యుత్ బకాయిల నిమిత్తం ఇపిడిసిఎల్‌కు రూ.9.04 కోట్లు జమచేస్తోంది. మిగిలిన రూ.20.14 కోట్లు పంచాయతీలకు జమచేయనుంది. అనకాపల్లి జిల్లాలో 24 మండలాల్లో 646 పంచాయతీలున్నాయి. ఈ పంచాయతీలు వీధిలైట్లు, తాగునీటి పథకాల విద్యుత్ బిల్లులకు ఇపిడిసిఎల్‌కు రూ.6.84 కోట్లు, ఎల్ఇడి బల్బుల కోసం ఇఇఎస్ఎల్‌కు రూ.2.20 కోట్లు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పంచాయతీలకు వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ.9.04 కోట్లు పంచాయతీలకు చేరకుండా ఇపిడిసిఎల్, ఇఇఎస్ఎల్‌కు పంచాయతీ అధికారులు సర్దుబాటుచేస్తున్నారు.

ఆర్థిక సంఘం విడుదల చేసిన అన్‌టైడ్ నిధులను పంచాయతీల నిర్వహణకు ఉపయోగించాల్సివుంది. టైడ్ నిధులను ప్రధానంగా శానిటేషన్, తాగునీటి సదుపాయాలకు ఖర్చు చేయాల్సివుంది. మౌలికసదుపాయాలు, అభివృద్ధి పనులకు వినియోగించాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ప్రాధాన్యతలతో సంబంధంలేకుండా ప్రభుత్వమే ఇపిడిసిఎల్‌కు మళ్లిస్తోంది. వీధిలైట్లు వేసుకోవడానికి డబ్బుల్లేని పంచాయతీలు ఆర్థిక సంఘం నిధులపై ఆధారపడ్డాయి. ఈ నిధుల్లో కొంతభాగం డిస్కాంకు చెల్లించడంతో పంచాయతీల నుంచి ఏ పనులూ చేపట్టలేక పోతున్నామని

మిగతా 2లో..

జిల్లాలో తొలి దశలో వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు(కోట్లలో)

నిధుల సర్దుబాటు	అన్‌టైడ్	టైడ్	మొత్తం	సర్దుబాటుచేసినది
ఇపిడిసిఎల్	3.75	3.08	6.84	9.04
ఇఇఎల్	1.73	46.56(లక్షలు)	2.20	
పంచాయతీలు	6.12	14.02	20.14	20.14
మొత్తం	11.61	17.57	29.19	29.19

కూలీల వ్యసనంపై ఖాకీల ప్రతాపం?

మద్యం తాగే ప్రాంతాల్లో పోలీస్ పహారా!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మద్య నిషేధం అమల్లో ఉన్న సమయాల్లో పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది దాడులు చేయడం తెలిసిందే. కానీ ఓ పక్క మద్యం విక్రయాలు జరుగుతున్న (నిషేధం లేని రోజుల్లోనూ) ఖాకీల పహారా నగర నలుమూలల, వీధులు, గ్రామాల్లో నానాటికీ ఎక్కువైంది. విశాఖ నగరంలోని అన్ని వార్డుల్లోనూ ఖాకీలు తమ విధినిర్వహణ అంటూ రోజు వారీ కూలీలు వెళ్లి తాగే ప్రాంతాల్లో కేసులు బుక్ చేస్తామంటూ హెచ్చరికలు జారీచేయడం తాజాగా కనిపిస్తోంది. దీంతో సాయంత్రం అయితే వైన్ షాపు వైపు కన్నెత్తి చూడలేని స్థితి కూలీలను వెంటాడుతోంది. మద్యం షాపుల చుట్టూ పోలీసు పహారా కాస్తూ బయట మద్యం సేవించే వారిని హెచ్చరించడంతో కూలీలు బెంబేలెత్తిపోతున్నారు.



పలుచోట్ల ఇదే వరస...

రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్, మాధవధార, మధురవాడ, ఆరిలోవ తదితర చోట్ల రోజు వారీ కూలి పనులు చేసుకుని సాయంత్రం మందు షాపు వైపు వెళ్లేవారిని సందుల్లో, గొందుల్లో దూరి మరీ ఈ దాడులు చేసేందుకు వేటాడడమే పోలీసుల పనిగా మారిపోయింది. వారంలో ప్రతి రోజూ ఓ ప్రత్యేక జాబ్ షీట్‌తో పోలీసులు కదులుతున్నారు. ఒక రోజు లైసెన్సులు, మరో రోజు హెల్మెట్లు, మద్యం ఇవన్నీ తెలిసిందే. వీటేటితోనూ నిమిత్తం లేకుండా మురికివాడలైన సుభాష్‌నగర్ వంటిచోట్ల పోలీసుల హల్‌చల్ పెరిగిపోయింది. రోజంతా చేసిన కాయకష్టాన్ని మరచిపోయేందుకు శ్రమజీవి సాయంకాలం వేళలో ఎంచుకున్న మందు షాపు వైపు అడుగులకు పోలీసులు చెక్ పెట్టే పరిస్థితులు నెలకొంటున్నాయి.

బార్‌లకు వెళ్లగలరా?

అందరూ బార్లు కెళ్లి తాగగలరా? మరీ ముఖ్యంగా రోజు కూలీలకైతే ఈ స్థితి ఉంటుందా? ఎన్నో ఏళ్లుగా కూలి చేసుకుంటూ ఒక వ్యసనంగా మారిపోయిన మందు అలవాటుపై పోలీసులు తాజాగా జులుం చేయడం చూస్తే పై ప్రశ్న అందరిలోనూ ఉదయిస్తోంది. మధ్యతరగతి, ధనికుల మాదిరిగా బార్‌లకు వెళ్లి తాగలేని పరిస్థితి రోజు కూలీలది. సాయంత్రం అయ్యేసరికి వీరిని తిరగనివ్వకుండా పోలీసులు పలుచోట్ల ఆటంకంగా మారుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూలీ చేసి తెచ్చుకున్న డబ్బుల్లో కొంత భాగం మందు కోసం వినియోగించడం శ్రామిక జీవులకు కొత్తేమీ కాదు. పైగా ఇళ్లకెళ్లి తాగే పరిస్థితి కూడా వీరిలో అత్యధికమందికి ఉండదు. బార్‌లు కెళ్లి మద్యం తాగే స్తోమత, ఇంట్లో కూర్చొని మద్యం తాగేటంత పరిస్థితి కూలీలకు ఉండదు. కాబట్టి పనంతా అయిపోయిన తర్వాత ఏ చెట్టునో, గట్టునో కూర్చొనడం, బడ్డీకొట్ల వద్ద మకాం వేసి మందు చుక్క వేసుకుని ఇళ్లకు చేరడం కొత్తేమీ కాదు. కూలీనాలీల వ్యాపకం అంతా నిత్యం ఎక్కడ చూసినా ఇదే. తాజా పోలీసు కదలికలతో మద్యం ప్రియులు నానా అవస్థలు పడడం కనిపిస్తోంది. 'మద్యం తాగి బళ్లు నడిపే వారిపై కాకుండా మామీద పోలీసుల ప్రతాపం ఏమిటి?' అంటూ పలువురు కూలీలు ప్రశ్నిస్తున్నారు.

పారిశుధ్య కార్మికులకు నియామక పత్రాలు

▶ వార్త 2లో..

రైతుబజార్‌లో బియ్యం, కందిపప్పు కౌంటర్ ప్రారంభం

▶ వార్త 2లో..

పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి పోరాటం ఉధృతం

▶ వార్త 3లో..

రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

అదనపు సిసిఎల్ఎ ఇంతియాజ్ అహ్మద్



ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రీసర్వే ప్రక్రియ ప్రభుత్వ నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని అదనపు సిసిఎల్ఎ ఇంతియాజ్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. విశాఖ జిల్లాలో రీసర్వే ప్రగతిపై శనివారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రీసర్వే సిబ్బంది ఎదుర్కొంటున్న సాంకేతిక, సాఫ్ట్‌వేర్ తదితర సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, ఆగస్టు 2023లోగా రీసర్వే పనులు పూర్తి చేయాలని తహశీల్దార్లు, సర్వే సిబ్బందికి ఆదేశించారు. ఇటీవల రెవెన్యూ శాఖ ద్వారా అసైన్మెంట్ భూములు, సర్వీస్ ఇనాం భూముల గురించి ప్రభుత్వం పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా సంస్కరణలు చేపట్టిందని, త్వరలోనే వాటికి సంబంధించిన ఉత్తరువులు ఇవ్వనున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ జిల్లాలో కొనసాగుతున్న రీసర్వే ప్రగతిని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఆర్‌డిఓలు భాస్కర్‌రెడ్డి, హుస్సేన్ సాహెబ్, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ సూర్యారావు, విశాఖపట్నం, భీమునిపట్నం, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల తహశీల్దార్లు, రీసర్వే డిటీలు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే గంగవరం ముట్టడి

అఖిలపక్ష కార్మిక సంఘాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే వారికి మద్దతుగా విశాఖ జిల్లా కార్మికులందరూ పోర్టు ముట్టడి చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారని విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో శనివారం సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగవరం పోర్టు నిర్మాణంలో నిర్వాసితులు తమ ఇళ్లను, భూములను త్యాగం చేసి, సముద్రంపై ఉన్న ఉపాధిని కూడా కోల్పోయి పోర్టు నిర్మాణానికి తోడ్పడ్డారని గుర్తుచేశారు. అటువంటి వారికి అతి తక్కువ వేతనాలు ఇస్తూ మోసం చేస్తున్నారని విమర్శించారు. మొత్తం రూ. 2వేల కోట్ల టర్నోవర్‌తో రూ.700 కోట్లు నికరలాభం ఈ ఏడాదే గంగవరం పోర్టు సాధించిందని తెలిపారు. దానిలో 5 శాతం మాత్రమే కార్మికులకు జీతాలుగా ఇస్తోందన్నారు. 14 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న కార్మికులకు కేవలం రూ.13 వేల నుంచి రూ.16,600, ఐదు సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగులకు రూ.9 వేల నుంచి రూ.9,700 మాత్రమే చెల్లిస్తోందని తెలిపారు. ఉద్యోగంలో చేరినప్పుడు ఇచ్చిన రూ.3700 బేసిక్ మాత్రమే ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. ఈ కంపెనీలో పోలీస్ శాఖకు చెందిన మాజీ ఉన్నతాధికారులను నియమించుకుందని, వారి ద్వారా నిర్బంధాలకు పూనుకుంటుందని విమర్శించారు. మరోవైపు అదానీ కంపెనీ కావడంతో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు అండగా ఉండటంతో కార్మికులు, కార్మిక సంఘాలపైనా గంగవరం యాజమాన్యం నిర్బంధాలకు పూనుకుంటోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని కార్మిక సంఘాలు, రాజకీయపార్టీలతో చర్చలు జరిపి పలు సూచనలు చేసినప్పటికీ వాటిని అమలు చేయడంలేదన్నారు. గంగవరం పోర్టులో షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు అమలు చేస్తున్నామని చెబుతున్నారని, ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే ఫ్యాక్టరీ, కార్మిక చట్టాలు, హక్కులు అమలు కావడం లేదన్నారు. 12 రోజుల నుంచి పెదగంట్యాడలో కార్మికుల రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయని, వీరి పోరాటాన్ని అణిచివేయడానికి అదానీ యాజమాన్యంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంటోందని విమర్శించారు. కార్మికుల పోరాటానికి మద్దతుగా విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాలు, ప్రభుత్వ ప్రయివేటు రంగ సంస్థలు, మున్సిపల్,

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పల్లెలకు తప్పని తిప్పలు

సర్పంచులు వాపోతున్నారు. సర్పంచులకు తెలియజేయకుండా 14వ ఆర్థిక సంఘం నిధులవలె 15వ ఆర్థిక సంఘం నిధులు డిస్కాంలకు చెల్లిస్తోంది. రహదారులు, కాలువలు, వీధిలైట్లు, తాగునీటి పథకాల మరమ్మతులు చేపట్టిన సర్పంచ్‌లు ఆ పనులకు ప్రభుత్వ నిర్ణయం వల్ల బిల్లులు చెల్లించలేమని అంటున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే 'గంగవరం' ముట్టడి

ఆటో, ముఠా, తోపుడు బండ్లు, బిల్డింగ్, స్కీమ్‌వర్కర్స్, హాస్పిటల్స్, ఇతర కాంట్రాక్టు వర్కర్ల సంఘాలు అదానీ యాజమాన్యం మొండివైఖరిపై నిరసనలు తెలిపి కార్మికులకు సంఘీభావం తెలియజేయాలని నాయకులు పిలుపునిచ్చారు. గంగవరం పోర్టు కార్మికులకు మద్దతుగా అఖిలపక్ష కార్మిక సంఘాలన్నీ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించాయి.

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో టిఎన్‌టియుసి నాయకులు నక్కా లక్ష్మణరావు, కె.నాగార్జునరావు, దొమ్మేటి.అప్పారావు (హెచ్‌ఎంఎస్), బోరా శశిభూషణం (వైఎస్‌ఆర్‌టియు), కె.మల్లయ్య (ఐఎఫ్‌టియు), ఎ.శ్యామ్‌శేఖర్ (ఐఎన్‌టియుసి), గంగవరం పోర్టు యూనియన్ నాయకులు బి.జగన్, విశాఖ క్యాబ్ యూనియన్ నాయకులు సిహెచ్.శ్రీనివాసరావు, నారాయణ, వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు పి.మణి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వై.తులసి, విశాఖ మోటారు ట్రాన్స్ పోర్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జి.అప్పలరాజు, ఎపిఎంఎస్‌ఆర్‌యు నాయకులు కెవిపి.చంద్రమౌళి, విశాఖ జిల్లా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, కందిపప్పు కౌంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఎంవిపి.కాలనీ రైతుబజార్‌లో ప్రత్యేక బియ్యం, కందిపప్పు కౌంటర్‌ను విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ కె.విశ్వనాథ్ శనివారం ప్రారంభించారు. ఈ కౌంటర్ ద్వారా బిపిటి సన్నాలు కిలో రూ.46 రూపాయలు, కందిపప్పు దేశవాళి రకం రూ.137కు విక్రయించనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యప్రకాష్, జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్, రైతు బజార్ ఎస్టేట్ అధికారి జి.ప్రసాద్, జి.కనకరాజు పాల్గొన్నారు.

దోచుకోవడమే జగన్ ప్రభుత్వ లక్ష్యం : పల్లా

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : దోచుకోవడమే జగన్ ప్రభుత్వ లక్ష్యమని టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, గతంలో టిడిపి ఇచ్చిన 100 గజాలలోపు ఉచిత ఇళ్ల పట్టాలకు డీడ్ ఆఫ్ రీకన్వేయన్స్ చేస్తామని జెసి చెప్పారని, ఇది మళ్లీ డబ్బులు దండుకోవడం కోసమే అన్నట్టుగా ఉందని విమర్శించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో 296, 301, 388 జిఒల కింద విశాఖలో 60 వేల పట్టాలు ఇచ్చామని, ఆ పట్టాలకు ఇప్పటికే జియో టాగింగ్ పూర్తయిందని తెలిపారు. మళ్లీ ఇప్పుడు వాటికి యూజర్ చార్జీలు, పట్టా వ్యాల్యూ కట్టమనడం దేనికని ప్రశ్నించారు. రాష్ట్రంలో మొత్తం 2 లక్షల మంది నుంచి ఈ రకంగా డబ్బులు దండుకోవడానికే ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ దక్షిణ ఇన్‌ఛార్జి గుండి బాబ్జీ మాట్లాడుతూ, ఎపి అసైన్డ్ ల్యాండ్ 1977 చట్టం జరిగి 20 ఏళ్లు పూర్తయిన కారణంగా డి పట్టా భూములు పొందిన వారికి భూమిని అమ్ముకోడానికి హక్కు ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. అసెంబ్లీలో చట్టసవరణ జరగకుండా భూములు అమ్ముకోడానికి నిర్ణయం చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

కనువిప్పు కలగాలి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నేతృత్వంలో అంగన్‌వాడీలు కలెక్టరేట్ల వద్ద చేపట్టిన 36 గంటల మహాధర్నాతో ప్రభుత్వానికి కనువిప్పుకలగాలి. మహిళల పట్టుదలను గుర్తెరిగి మసలుకుంటే మనుగడవుంటుందని ప్రభుత్వం గ్రహించాలి. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఏకోన్ముఖంగా కదిలిన ఆడపడుచుల పట్ల ఆగ్రహం ప్రదర్శించకుండా, కక్షసాధింపు చర్యలకు దిగకుండా డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలి. తమ అభిప్రాయాలు, బాధలు, సమస్యలు చెప్పుకోనివారు తమకు వ్యతిరేకులన్న దురాభిప్రాయం ప్రభుత్వానికి ఉంటే వదులుకోవాలి. తాను చెప్పినట్లు వినాలని, నడచుకోవాలనీ పొరపాటు ఆలోచనలుంటే మానుకోవాలి. మానుకోని ప్రభుత్వాలు, నాయకులు నిలవనులేదు. నిలిచిన చరిత్రలేదు.

ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలన్న అంగన్‌వాడీల ప్రధాన డిమాండ్‌లో న్యాయముంది. బడ్జెట్ తగ్గించి, పేద కుటుంబాలకు పోషకాహారం అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యంచేసి క్రమంగా తగ్గించాలన్న ప్రభుత్వ ఆలోచనలో అన్యాయముంది. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి నిరుపేదలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీలను ఆదుకోవడం ప్రభుత్వ కనీస బాధ్యత. ఆ బాధ్యతోనే పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వస్తే తెలంగాణ ప్రభుత్వం కంటే ఎక్కువ వేతనం ఇస్తామని



జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇపుడు అంగన్‌వాడీలు అడుగుతున్నది కూడా పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని. ఇందులో తప్పేముంది? ప్రభుత్వయంత్రాంగంతో బెదిరించాల్సిన పనేముంది? పోలీసులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరమేముంది? ఇచ్చిన మాట నిలబెట్టుకోమనే కదా వారు కోరుతున్నారు. అధికారం చేతికొచ్చాక ఇచ్చిన హామీ ప్రభుత్వం మర్చిపోవచ్చుగానీ, హామీ పొందిన జనం గుర్తుపెట్టుకొని గుణపాఠం చెబుతారు. ఆ పరిస్థితి ఉత్పన్నంకాకముందే ప్రభుత్వం మేల్కొంటే మంచిది. రాజకీయ జోక్యం, వేధింపులు లేకుండా చూడాలి.

పెరిగిన నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలకు తగినట్లు వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ్ మెనూ ఛార్జీలు పెంచాలి. 78 నెలల టిఎ, డిఎలు తక్షణమే చెల్లించాలి. గ్యాస్ సిలిండర్ ప్రభుత్వమే సరఫరా చేయాలి. సిటీలో రూ.12వేలు, గ్రామీణ ప్రాంతంలో రూ.10వేలు లోపు వేతనమున్న వారికి సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని చెప్పి, అమలుచేయకపోవడం ప్రభుత్వం తప్పుకాదా? ఈ తప్పు సరిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? మాట తప్పని, మడమ తిప్పని ప్రభుత్వంలో హామీలు అమలుచేయాలి, సమస్యలు పరిష్కరించాలి తప్ప కొనసాగనివ్వకూడదు. సుప్రీంతీర్పుపై ఏ మాత్రం గౌరవమున్నా అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలి.

పారిశుధ్య కార్మికులకు నియామక పత్రాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసిలో వివిధ కారణాల వల్ల ఏర్పడిన 482 పోస్టులకు గాను ప్రస్తుతం 119 మందికి ఉద్యోగ నియామక పత్రాలను మేయర్ గొలగాని హరి వెంకట కుమారితో కలిసి ఉమ్మడి విశాఖ జిల్లా వైసిపి సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి అందించారు. హోటల్ మేఘాలయలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరాన్ని మరింత పరిశుభ్రతగా తీర్చిదిద్దేందుకు నూతనంగా నియమితులైన పారిశుధ్య కార్మికులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. విశాఖ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ కార్మికులు కీలకమన్నారు.

మేయర్ గొలగాని హరివెంకటకుమారి మాట్లాడుతూ, వివిధ కారణాల వల్ల మరణించిన, 60 సంవత్సరాలు పైబడి విధుల నుంచి తొలగింపబడిన కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలతో అర్హులైన వారందరికీ ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాస్, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మహిళా ద్రోహి : వరుదు కల్యాణి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : చంద్రబాబు మహిళా ద్రోహి అని వైసిపి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపించారు. మహిళల కోసం ఆయన ఏర్పాటుచేసిన మహాశక్తి కార్యక్రమాన్ని చూసి మహిళలే నవ్వుకుంటున్నారన్నారు. మద్దిలపాలెంలోని వైసిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల పుట్టుకనే చంద్రబాబు అవమానించారన్నారు. 2014లో అధికారంలోకి వచ్చే ముందు రూ.14,500 కోట్లు డ్వాక్రా రుణమాఫీ చేస్తానని చెప్పి మోసం చేశారన్నారు. చంద్రబాబు పాలనలో మహిళలకు రక్షణే లేకుండాపోయిందని ఆరోపించారు.



మాట్లాడుతున్న అజ శర్మ, పక్కనే సిపిఎం నేత గంగారావు

పంచగ్రామాల భూ సమస్య పరిష్కారానికి
పోరాటం ఉధృతం

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ గంగారావు
- 22న సింహాచలం కూడలిలో మహాధర్నా
- దేవస్థానం అధికారుల దాడులపై ప్రతిఘటన

ప్రజాశక్తి- సింహాచలం: పంచ గ్రామాల భూసమస్య పరిష్కారానికి పోరాటమే తుది ఆయుధమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజ శర్మ, 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు అన్నారు.ఇందులో భాగంగానే ఈనెల 22న సింహాచలం ప్రధాన కూడలి వద్ద భారీస్థాయిలో ధర్నా చేయాలని నిర్ణయించారు.

శనివారం స్థానిక కల్యాణ మండపంలో కాలనీవాసుల వాసులు, బాధితులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నేతలు కల్లబొల్లి కబుర్లు చెప్పి తమ పబ్బం గడుపుకుంటున్నారని, అధికారంలోకి వచ్చాక కమిటీలతోనే కాలయాపన చేస్తూ బాధితులను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ నేతల మాయమాటలను విశ్వసించే పరిస్థితి లేదని, సమస్య పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 22వ తేదీన సింహాచలం కూడలిలో నిర్వహించే మహాధర్నాలో పెద్దఎత్తున బాధిత కుటుంబాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పంచ గ్రామాల భూములపై స్టేటస్‌కో అమలులో ఉన్నప్పటికీ, దేవస్థానం అధికారులు తమకు అవసరమైన నిర్మాణాలు చేపడుతున్నారని, అదే బాధితులెవరైనా కాసింత నిర్మాణం చేపడితే చాలు దేవస్థానం అధికారులు ఆగమేఘాలమీద వచ్చి దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ఈసారి దేవస్థానం అధికారులు దాడులకు వస్తే అందరం సమిష్టిగా తిప్పికొట్టాలని నిర్ణయించారు. 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి వార్డు కార్పొరేటర్ తో త్వరలో సమావేశమై, తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు టీవీ కృష్ణంరాజు, బి రమణి,



సమావేశానికి హాజరైన పంచగ్రామాల ప్రజలు

జంతు సంరక్షణ కేంద్రానికి ఎలుగు బంటి

ప్రజాశక్తి - ఆరిలోవ : శ్రీకాకుళం జిల్లా మందస ప్రాంతంలో సంచరిస్తున్న ఎలుగు బంటిని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, శ్రీకాకుళం జిల్లా అటవీశాఖ అధికారుల సమన్వయంతో పట్టుకుని జంతు సంరక్షణా కేంద్రానికి తీసుకొచ్చారు. జూ వైద్యులు ఎలుగుబంటికి వైద్యపరీక్షలు చేసి, శరీరంపై కొన్ని గాయాలు ఉన్నట్టు గుర్తించారు.

ఎలుగుబంటికి చూపు లేనట్టుగా ప్రాథమికంగా గుర్తించారు. ఎలుగు బంటిని చాకచక్యంగా పట్టుకొని విశాఖ జంతు సంరరక్షణ కేంద్రానికి తరలించడంలో శ్రీకాకుళం డిఎఫ్ఒ నిషా కుమారి జూ వెటర్నరీ డాక్టర్ ఫణీంద్ర, శ్రీకాకుళం అటవీశాఖ అధికారులు కీలక పాత్ర వహించినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు.

సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భాస్కర రెడ్డి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఓటరు జాబితా సమగ్రంగా రూపొందించేందుకు ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింటికీ వెళ్లి తమ సిబ్బంది పరిశీలిస్తారని స్థానిక ఆర్‌డిఒ, భీమిలి నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి ఎస్ భాస్కరరెడ్డి స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఓటరు జాబితాతో ఇంటి వద్దకు వచ్చే బిఎల్‌ఒలకు సహకరించాలని కోరారు. నిర్ణీత తేదీల్లో ఓటరు జాబితా పరిశీలన, తప్పొప్పులు సవరిస్తారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జె భాస్కరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కె సుభాష్ (టిడిపి), కె రామానాయుడు (బిజెపి), కె రాంబాబు (సిపిఐ) పాల్గొన్నారు

ఘనంగా రాజా సిద్ధార్థ జన్మదిన వేడుకలు



మాట్లాడుతున్న డాక్టర్ రావు

ప్రజాశక్తి-ఆనందపురం : రాష్ట్ర అనుభవ వైద్యుల సంఘాల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు రాజా సిద్ధార్థ జన్మదిన వేడుకలు శనివారం మండల కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఫెంపా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు జంగం జోషి, జోనల్ ప్రధాన కార్యదర్శి, ఫెంపా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు యన్ సుగుణేశ్వరి ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్‌ఎల్ రావు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రావు మాట్లాడుతూ, వైఎస్సార్ హాయంలో జిఒ 429 తెచ్చి, గ్రామీణ వైద్యుల జీవితాల్లో రాజాసిద్ధార్థ వెలుగులు నింపారన్నారు. రద్దయిన ఆ జిఒ పునరుద్ధరణకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జోనల్ గౌరవాధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, కోశాధికారి పచ్చిపులుసు కనకారావు, క్రమశిక్షణ కమిటీ కో కన్వీనర్ రాలి అప్పారావు, జయరావు, కడగల నారాయణరావు, జిబి రాజు, ఆనందపురం మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, రఘు, ఎస్ శ్రీనివాసరావు, వాసు, శివ, బెహరా రాధిక పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసమే విద్య ముఖ్య లక్ష్యం

ప్రజాశక్తి -ములగాడ : వ్యక్తిత్వ వికాసమే విద్య ముఖ్య లక్ష్యమని సెయింట్ ఆన్స్ కళాశాల హిందీ అధ్యాపకురాలు, ఎన్‌ఎస్‌ఎస్ పూర్వ ప్రోగ్రాం అధికారి ఎ.ఆదిలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న మహిళా సాధికారత తరగతుల్లో వ్యక్తిత్వ వికాసంపై వివరించారు. ప్రతిఒక్కరూ సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండాలని, బలాలు, బలహీనతలేమిటో తెలుసుకుని బలాలకు పదును పెట్టుకోవడం, బలహీనతలను అధిగమించడం ద్వారా అవకాశాలను అందిపుచ్చుకుని విజయాన్ని సాధించాలన్నారు. సమయపాలన ప్రాధాన్యతపై శివరంజని ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మహిళా సాధికారితపై మూడు రోజుల శిక్షణ తరగతులు ముగిసాయి.

డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ శిక్షణా తరగతులు నిర్వహించడం అభినందనీయమని కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా అన్నారు. సదస్సులో పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, రిసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరించిన అధ్యాపకులు అంజలీదేవి, ప్రశాంతి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులతో భేటీ

ప్రజాశక్తి -తగరపువలస :వృత్తిపరంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై జాతీయ చేనేత కార్మిక సంఘం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు గిడుతూరి శ్రీనివాసరావు, తదితరులతో చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మురళి శనివారం తగరపువలసలో చర్చించారు.చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జాతీయ చేనేత కార్మిక సంఘం జాతీయఅధ్యక్షులు ఎ.మల్లికార్జునరావు, రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రుషింగప్ప పిలుపుమేరకు ఇటీవల అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద ఆందోళనలు చేసిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తమ వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారని సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు

17వరకు డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి -భీమునిపట్నం : డిగ్రీలో ప్రవేశం పొందేందుకు రిజిస్ట్రేషన్ గడువు ఈనెల 17వతేదీకి పొడిగించినట్లు స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ మంజుల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు

భక్తులతో కిక్కిరిసిన సింహగిరి

ప్రజాశక్తి-సింహాచలం: సింహగిరి శనివారం భక్తులతో కిక్కిరిసింది భక్తుల అధిక సంఖ్యలో తరలి రావడంతో రూ.100, రూ.300టిక్కెట్లతోపాటు ఉచిత దర్శనాల్లో క్యూలైన్ల రద్దీగా కనిపించాయి అన్నదానం కోసం క్యూ లైన్‌లో భక్తులు పెద్దఎత్తున బారులుదీరారు. ప్రసాదాలు కౌంటర్ వద్ద సరైన క్యూలైన్ లేక భక్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. భక్తుల రద్దీ కారణంగా కొండ దిగువ నుంచి కొండపై వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు సింహాద్రి అప్పన్నను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నీమాస్త్రంతో చీడపీడల నివారణ

ప్రజాశక్తి-ఆనందపురం: ప్రకృతి వ్యవసాయంపై ప్రజల్లో అవగాహనలో భాగంగా చీడపురుగుల నివారణకు నీమాస్త్రం కషాయం తయారీ వినియోగంపై తర్లువాడ గ్రామంలో రైతులకు వివరించారు. యూనిట్ ఇన్‌ఛార్జి రామారావు నీమాస్త్రం తయారీ విధానాన్ని రైతులకు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.

ఒక డ్రమ్ములో 200 లీటర్ల నీరుపోసి, అందులో 10 కేజీల వేపాకు ముద్ద, 10 లీటర్ల దేశి ఆవు మూత్రం, రెండు కేజీల దేశీ ఆవు పేడ వేసి కలగలిపి 48 గంటలపాటు నిల్వ ఉంచాలని సూచించారు. ఈ కషాయాన్ని పైర్లపై రసం పీల్చేపురుగులు, గొంగళి, ఇతరత్రా చీడపురుగులు ఆశిస్తే, ఆ కషాయాన్ని ఆలాగే పైర్లపై పిచికారీ చేయడం ద్వారా సమర్థవంతంగా నివారించవచ్చని సూచించారు. ఒకసారి తయారు చేసిన కషాయం మూడు నెలల వరకు నిల్వ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ పైడిరాజు,వెంకటలక్ష్మి, స్థానిక మహిళా రైతులు పాల్గొన్నారు.

పెందుర్తి :సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంట దిగుబడి సాధించవచ్చునని ఆర్‌టిఒ ప్రకాశరావు అన్నారు. కరకవానిపాలెం గ్రామంలో రైతులకు నిర్వహించిన అవగాహన పంటమార్పిడి విధానాన్ని రైతులు అవలంభించాలని, ప్రకృతి విధానంలో సాగు వల్ల భూసారం పరిరక్షించడంతోపాటు ఆరోగ్యవంతమైన పంట దిగుబడులను సాధించవచ్చని సూచించారు. నీమాస్త్రం తయారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఎంటి పద్మ, వనజ, ఎన్‌ఎఫ్ఎఎంఎ పైడిపల్లి, ఐసిఆర్‌పిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై ఆధునిక వ్యవసాయ పరికరాలు

ప్రజాశక్తి-పద్మనాభం : నూతన వ్యవసాయవిధానంలో భాగంగా రాయితీపై డ్రోన్లు, ఇతర ఆధునిక పరికరాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఎంవి. చలం సూచించారు. శనివారం మండల పరిషత్‌లో నిర్వహించిన వ్యవసాయ సలహామండలి సమావేశంలో మాట్లాడుతూ, మండలంలోని 16రైతుభరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఐదుగురు రైతులు సభ్యులుగా గ్రూపు ఏర్పడితే రూ.పది లక్షల రుణం ఇస్తారన్నారు. వ్యవసాయ పథకాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆక్రమణల తొలగింపులో జాప్యమెందుకు?

అధికారుల తాత్సారంపై సర్వత్రా అనుమానాలు

ప్రజాశక్తి -పిఎం.పాలెం: జివిఎంసి ఆరోవార్డు కొమ్మాది సమీపంలోని జిసిసి లేఅవుట్‌లో డ్రైనేజీలపై నిర్మించిన ఆక్రమణల తొలగింపులో అధికారుల జాప్యానికి ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మురుగుకాలువలను ఆక్రమించుకుని వాటిపై దుకాణాలను నిర్మించడం వల్ల మురుగునీరు సాఫీగా సాగని పరిస్థితి ఉంది. దీంతోచిన్నపాటి వర్షం కురిసినా వర్షపునీరుతోపాటు కాలువల్లోని మురుగునీరు కూడా రోడ్డుపైకి చేరి నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈ నెల 5న ప్రజాశక్తి దినపత్రిక లో 'కాలువల ఆక్రమణలతో మురుగు కష్టాలు' శీర్షికతో వెలువడిన కథనానికి జివిఎంసి జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి స్పందించి డ్రైనేజీ ఆక్రమణలను స్వయంగా పరిశీలించారు. వారంరోజుల్లోగా తొలగింపునకు చర్యలు చేపడతామని ప్రకటించారు. ముందుగా ఆక్రమణదారులకు విద్యుత్ సరఫరా నిలిపేయాలని ఆదేశించారు. అంతవరకు బాగానే ఉంది, కానీ ఆ తర్వాతే ఎటువంటి చర్యలు ముందుకు కదల్లేదు.విద్యుత్ నిలిపివేత ఆదేశాలే అమలుకానపుడు, మిగతావి ఇంకెపుడు చేపడతారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ అధికారులు వివరణ

ఆక్రమణదారులకు విద్యుత్ సరఫరా నిలుపుదలపై కొమ్మాది సెక్షన్ విద్యుత్ ఎఇని వివరణ కోరగా, జివిఎంసి కార్యాలయం నుంచి తమకు ఎటువంటి ఆదేశాలు రాలేదని, వచ్చిన వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అంటున్నారు.

జోనల్ కమిషనర్ వివరణ.

దీనిపై రెండవ జోన్ కమిషనర్ కనకమహాలక్ష్మిని సంప్రదించగా, విద్యుత్ అధికారులకు లేఖ రాసేందుకు తమ కార్యాలయంలో ఆపరేటర్లు లేరని, అందుకే జాప్యం జరుగుతోందని అంటున్నారు. అంతేకాక విద్యుత్ అధికారులకు లేఖ పెట్టాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు తగు సూచనలిచ్చామని అంటున్నారు. ఆక్రమణల తొలగింపుపై కఠినంగా వ్యవహరించాల్సిన అధికారులు ఇలా ఆపరేటర్ లేరంటూ తాత్సారం చేయడంపై విమర్శలు వస్తున్నాయి. అసలు అధికారులకు ప్రజల కష్టాలు పట్టించుకునే చిత్తశుద్ధి ఉందాయని పలువురు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.



ఆక్రమణలను పరిశీలిస్తున్న జెడ్‌సి (ఫైల్‌ఫొటో)

గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులకు మద్దతుగా
జాతీయస్థాయిలో ఉద్యమం



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నరేంద్రరావు

- ఆల్ ఇండియా వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందకుమార్, నరేంద్రరావు
- 12వ రోజుకు కార్మికుల నిరవధిక దీక్షలు

ప్రజాశక్తి –గాజువాక : అదాని గంగవరం పోర్టు నిర్వాసిత కార్మిక సమస్యలు పరిష్కరించకపోతే జాతీయ స్థాయిలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఆల్ ఇండియా వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిడి నందకుమార్, టి నరేంద్రరావు స్పష్టం చేశారు. వేతన పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి పోర్టు కార్మికులు చేపడుతున్న నిరవధిక నిరసన దీక్షలు శనివారం 12వ రోజుకు చేరాయి. దీక్ష శిబిరాన్ని సందర్శించిన వారు మాట్లాడుతూ, గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల న్యాయమైన సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఆదివారం పోర్టులో నిర్వహించే సమావేశంలో అన్ని యూనియన్ల మద్దతు కూడగడతామన్నారు. అలాగే ఈనెల 18,19 తేదీల్లో చెన్నైలో ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ సమావేశంలోనూ ఈ విషయాన్ని ప్రస్తావించి, అన్ని పోర్టుల మద్దతునిప్పిస్తామన్నారు. వేతనాలు పెంచాలని ఆందోళన చేస్తున్న కార్మికులను విధుల నుంచి తొలగించడం దారుణమని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం పోర్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ సెక్రెటరీ ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి బి జగన్ దీక్షాశిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. యూనియన్ నాయకులు కొవిరి అప్పలరాజు, నొల్లి తాతారావు, వాసుపిల్లి ఎల్లయ్య, ఎల్లాజీ గంటిపిల్లి అమ్మోరు, మాద అప్పారావు, పేర్ల నూకరాజు, కదిరి సత్యానందం, గంటిపల్లి లక్ష్మయ్య, నొల్లి స్వామి, కొవిరి అమ్మోరు, టిడిపి నాయకులు పులి రమణారెడ్డి పాల్గొన్నారు.

అపోలో వైద్యుడికి అరుదైన గౌరవం



డాక్టర్ అబ్దుల్ డి ఖాన్

ప్రజాశక్తి – ఆరిలోవ : అపోలో వైద్యులు ప్రొఫెసర్, హెచ్ఒడి డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ సమర్పించిన నాలుగు శాస్రీయ కథనాలు ఈ నెల నవంబరులో ఈజిప్టు, కైరోలో జరగనున్న ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఆర్థోపెడిక్ సర్జరీ అండ్ ట్రామాలజీ వరల్డ్ కాంగ్రెస్‌లో ప్రదర్శనకు ఆమోదించబడ్డాయి. ఈమేరకు ఎస్ఐసిఒటి కాంగ్రెస్ సైంటిఫిక్ కమిటీ లేఖను పంపింది. అపోలో ఆసుపత్రిలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అబ్దుల్ డి ఖాన్‌కు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నట్టు ఆసుపత్రి యాజమాన్యం హర్షం వెలిబుచ్చింది. బొటనవేలు, చీలమండ ఆర్థ్రోస్కోపి, పాదంలో వైకల్యం దిద్దుబాటు వంటి శస్త్ర చికిత్సలను ఆధునిక ప్రక్రియల ద్వారా చేపట్టడంలో డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ నిష్ణాతులు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్, విఎంఆర్‌డిఎ చైర్మన్, కార్పొరేటర్

ప్రజాశక్తి – ఆరిలోవ :గడపగడపకూ మన ప్రభుత్వంలో ఇచ్చిన హామీల్లో భాగంగా 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆరిలోవ కాలనీ, వెర్ని దుర్గానగర్‌లో శనివారం కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. రూ 16 లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, విఎంఆర్‌డిఎ చైర్మన్ అక్కరమాని విజయనిర్మల శంకుస్థాపన చేయగా, వైసిపి నేతలు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

సీతమ్మధార : గడపగడపకు మన ప్రభుత్వము కార్యక్రమంలో వచ్చిన సమస్యల మేరకు మంజూరైన నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. 24వవార్డు గాంధీనగర్ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద రూ.20 లక్షలతో సిసిరోడ్లు,డ్రైనేజీలు, నక్కవానిపాలెంలో రూ.20లక్షలతో సామాజిక భవనం నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె రాజు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ స్థానిక ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముందుగా ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎఇ శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ఫ్యాన్ ఆగిపోతే పథకాలు ఆఫ్!



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి–పద్మనాభం : వచ్చే ఎన్నికల్లో వైసిపి ఓటమితో ఫ్యాన్ అగిపోతే పథకాలన్నీ ఆగిపోతాయిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లి, తునివలస గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో పాల్గొని, పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కుల,మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగన్మోహనరెడ్డికి దక్కుతుందన్నారు. పాండ్రింగి గ్రామానికి గోస్తనీనదిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.16.50కోట్లు నిధులు మంజూరై, టెండర్లను ఆహ్వానించారన్నారు..పద్మనాభం నుంచి శాంతినికేతన్ వరకు రోడ్డు విస్తరణ పనులు రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. ఎంపిపి కె రాంబాబు. జెడ్‌పిటిసి సుంకర గిరి బాబు. ఎంపిడిఒ ఎం విజయకుమార్. ఎంపిటిసి ఈర్ల రాజేశ్వరి, నాయకులు ఎస్.ఆదిబాబు. బి సన్యాసినాయడు పాల్గొన్నారు

ఘనంగా ఎసిఎ వ్యవస్థాపక దినోత్సవం



లోగోను ఆవిష్కరిస్తున్న గోపీనాథరెడ్డి

ప్రజాశక్తి పిఎం.పాలెం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పిఎం.పాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ, విడిసిఎం అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిఎ సెక్రటరీ గోపీనాథ్‌రెడ్డి స్టేడియం అవరణలో పతాకావిష్కరణ చేసి మొక్కలను నాటారు. ఎసిఎ ఏడు దశాబ్దాల ప్రయాణాన్ని సూచిస్తూ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్లాటినం జూబ్లీ ఇయర్ లోగోను ఆవిష్కరించారు. భారత్‌కు తొలి టెస్టు కెప్టెన్, ఎసిఎ తొలి రంజీ కెప్టెన్ సీకే నాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈసందర్భంగా గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ 70వసంతాల చరిత్ర కలిగిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ దినదినాభివృద్ధి చెందుతూ నేడు దేశవ్యాప్తంగా గర్వించదగ్గ స్థాయిలో నిలవడం గర్వంగా ఉందన్నారు. భారత జాతీయజట్టుకు నైపుణ్యులైన క్రికెటర్లను అందించేందుకు ప్రతిజిల్లాలోనూ 18 టాప్–క్లాస్ గ్రౌండ్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. క్రికెట్ క్రీడపై ఆసక్తి కలిగి, అవకాశాల కోసం ఎదురుచూస్తున్న క్రీడాకారులను ప్రతి జిల్లా నుంచి వెలుగులోకి తెస్తామన్నారు. రెసిడెన్షియల్ అకాడమీలు, ఆంధ్రా ప్రీమియర్ లీగ్ ప్రారంభం, మహిళా టి20, మాజీ రంజీ ప్లేయర్‌లకు మద్దతు తదితర కీలక అంశాలను వివరించారు. కార్యక్రమంలో విడిసిఎ కార్యదర్శి పార్థసారథి, ఉపాధ్యక్షులు ఎస్ఎస్ఆర్‌కె ప్రసాద్, సిఇఒ వెంకట శివారెడ్డి, డి.సంజయ్, ఎఫ్ఒ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి జాహ్నవి



జాహ్నవి

ప్రజాశక్తి –భీమునిపట్నం : స్థానిక కెజిబివి విద్యార్థిని కె జాహ్నవి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గంగాకుమారి శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్‌లో 575 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జాహ్నవి ట్రిపుల్ ఐటిలో సీటు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందిచారు.

గ్రామస్థాయి నుంచే నిరుద్యోగ నిర్మూలన



మాట్లాడుతున్న శ్రీధర్ రెడ్డి.

ప్రజాశక్తి –గాజువాక :గ్రామస్థాయి నుంచి నిరుద్యోగాన్ని నిర్మూలనకు రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, స్కిల్ హబ్స్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారని ప్రభుత్వ సలహాదారుడు, స్కిల్ ట్రైనింగ్ జాబ్ ఫెయిర్ ప్రతినిధి మిలీనియం శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం విశాఖ డెయిరీ ప్రైవేట్ స్కూల్ వరల్డ్ యూత్ స్కిల్‌డే సెలబ్రేషన్స్‌ను ను సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ యువతకు శిక్షణతోపాటు ఉపాధి కల్పించే యోజనలో ప్రభుత్వం ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమయ్య మ్యాన్‌పవర్ సమీకరణలో భాగంగా ముందుగా యువతలోని నైపుణ్యాలను గుర్తించి, శిక్షణనిస్తామన్నారు. గ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలో దేశంలోనే రాష్ట్రం రెండోస్థానంలో ఉందని కేంద్ర గ్రామీణ మంత్రిత్వశాఖ వెల్లడించిన విషయాన్ని వెల్లడించారు. సీడ్ అప్ సిఇఒ ఎంకెవి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో 35ఏళ్ల లోపు యువతకు శిక్షణనిచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ అప్పారావు, శోభారాణి, ఎం.కల్యాణి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంచాలి



మాట్లాడుతున్న ఆర్‌జెడి జ్యోతీకుమారి

ప్రజాశక్తి –భీమునిపట్నం : విద్యార్థి దశలోనే వారిలో జీవన నైపుణ్యాలు పెంపొందించాలని విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ ఎం.జ్యోతికుమారి స్పష్టం చేశారు కృత్యాధార జీవన నైపుణ్యాల అభివృద్ధి అనే అంశంపై స్థానిక సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా వ్యాయామ ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ, పాఠశాలలో నెలవారీ28 కృత్యాలను నిర్వహించాలన్నారు.

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందిం చడం, క్రమశిక్షణ అలవర్చాలని సూచించారు. మ్యాజిక్ బస సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ ఎల్ సుధాకర్, ప విద్యాశాఖాధికారి గౌరీశంకర్, మ్యాజిక్ బస్ రీజినల్ కోఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, జిల్లా కోఆర్డినేటర్ దినేష్, రిసోర్స్ ర్సన్లు గొట్టేటి రవి, మాధవి, హరిణి పాల్గొన్నారు

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి : కలెక్టర్

- విద్యాశాఖ అధికారులతో సమీక్షలో కలెక్టర్ మల్లికార్జున



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి – ఆరిలోవ :ప్రతి విద్యార్థిపైనా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టి వారి సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. శనివారం విశాఖ వ్యాలీ స్కూల్‌లో డిఇఒ ఎల్.చంద్రకళ అధ్యక్షతన ఎంఇఒలు, హెచ్ఎంలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారికి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలే కాకుండా, వారి సమగ్ర మూర్తిమత్వ అభివృద్ధికి దోహద పడేలా తీర్చిదిద్దాలని సూచించారు. టెన్త్‌విద్యార్థులపైనే కాకుండా, అన్ని తరగతులు విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు చొరవ చూపాలని ఆదేశించారు. నాణ్యతకు పెద్దపీట వేస్తూ నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఎంఇఒలను ఆదేశించారు.రానున్న వర్షాల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శిథిల భవనాలలో తరగతులు నిర్వహించకుండా ముందస్తు ఆదేశాలు జారీ చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తగా ఉండాలని సూచించారు. పిల్లల్లో ఆటపాటలను ప్రోత్సహించాలని, ఆటల సమయంలో ఏ పిల్లవాడు తరగతి గదుల్లో ఉండకుండా చూడాలన్నారు. అనంతరం డిఇఒ చంద్రకళ విద్యా విషయాలపై సమీక్ష నిర్వహించారు.కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డిప్యూటీ డిఇఒ గౌరీ శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మూసిన సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలి

- 20న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు
- ఎపి చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అప్పారావు, సూర్యనారాయణ

ప్రజాశక్తి- అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానం మేరకు రాష్ట్రంలో మూతపడిన చక్కెర పరిశ్రమలను తెరిపించాలని, ఫ్యాక్టరీలను ఆధునికీకరించాలని ఎపి చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అప్పారావు, మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రాము నాయుడు భవనంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న 29 చెరుకు ఫ్యాక్టరీల్లో 24 మూతపడి ఉన్నాయని, వాటిలో 11 కో-ఆపరేటివ్ ఫ్యాక్టరీల్లో ఒక్క గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాత్రమే క్రషింగ్ నిర్వహిస్తోందని తెలిపారు. కొత్తగా ఒక పరిశ్రమ కూడా తెరిపించక పోగా, ఆరు కో-ఆపరేటివ్ ఫ్యాక్టరీలను లిక్విడేషన్ ప్రకటించడం దుర్మార్గమన్నారు. గతంలో రాష్ట్రంలో 7 లక్షల ఎకరాల్లో చెరుకు పంట పండించి ఫ్యాక్టరీలకు సరఫరా చేస్తే, ప్రస్తుతం ఒక లక్ష 20 వేల ఎకరాలకు చెరుకు పంట విస్తీర్ణం తగ్గిపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడం, చెరుకు సరఫరా చేసిన 15 రోజులకే పేమెంట్లు ఇవ్వకపోవడం, చక్కర రికవరీ పెంచే నూతన చెరుకు వంగడాలని రూపొందించకపోవడం వంటి లోపాల వలన రైతులకు చెరుకు పంట పట్ల ఆసక్తి తగ్గిందని చెప్పారు. ఫ్యాక్టరీల సామర్థ్యానికి సరిపడా చెరుకు లేకపోవడం వలన ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చక్కెర పాలసీని రూపొందించి సుగర్ ఫ్యాక్టరీలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. 2023-24 సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం చెరుకు మద్దతు ధర టన్నుకి రూ.3,150 ప్రకటించిందని, పెరిగిన సాగు ఖర్చు నిష్పత్తిలో పెంచకపోవడం దారుణమన్నారు.



మాట్లాడుతున్న మర్రాపు సూర్యనారాయణ, చిత్రంలో రైతు నాయకులు

జాతీయ వ్యవసాయ కమిషన్ సిఫార్సుల మేరకు టన్నుకి రూ.5 వేలు ప్రకటించాలని కోరుతూ ఈ నెల 20న రాష్ట్రవ్యాప్తంగా చెరుకు ఫ్యాక్టరీల వద్ద, కేంద్ర ప్రభుత్వం కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, కోశాధికారి గండి నాయనబాబు, నాయకులు ఎ.బాలకృష్ణ, సోమిరెడ్డి వీరునాయుడు, బి.నాగేశ్వరరావు, డి.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య స్నేహితుల ఆర్థిక సాయంతో మెరుగుపడిన ఆరోగ్యం

ప్రజాశక్తి అచ్యుతాపురం : 19 సంవత్సరాల క్రితం అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న 2004 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితుడు అమరపిన్ని సురేష్‌కు తోటి మిత్రులు ఆర్థిక సాయం అందించారు. అమరపిన్ని సురేష్ విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతని పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం విశాఖలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. హాస్పటల్లో వైద్య ఖర్చులు సురేష్ కుటుంబం భరించలేని విధంగా చెప్పడంతో స్నేహితులు ముందుకొచ్చి ప్రసార మాధ్యమాల ద్వారా ఆర్థిక సహాయాన్ని కోరారు. దాతలు విరాళాలతోపాటు తమ స్నేహితులందరూ కలిసి రూ.71 వేలు సమకూర్చారు. ఆ మొత్తాన్ని సురేష్ కుటుంబీకులకు అందజేశారు. సురేష్ ఆరోగ్యం మెరుగు పడడంతో అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీలో తన సొంత ఇంటికి తీసుకొచ్చారు. స్నేహితులందరూ కలిసి సురేష్‌ను ఆయన గృహం వద్ద శనివారం కలిసి అతనికి భరోసా ఇచ్చారు.

తెల్లరేషన్ కార్డుదారులకు బిపిటి బియ్యం, కందిపప్పు

ప్రజాశక్తి- అనకాపల్లి : పెరుగుతున్న ధరల స్థిరీకరణ నేపథ్యంలో అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి పట్టణాల్లో తెలుపు రేషన్ కార్డుదారులందరికీ కిలో రూ.46కు బిపిటి బియ్యం పది కిలోలు, కిలో రూ.137కు కందిపప్పు సరఫరా చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలమంచిలి కోర్టు పేట క్రాంతి ట్రాన్స్పోర్ట్ ఎదురుగా శ్రీవెంకటేశ్వర ట్రేడింగ్ కంపెనీ, నర్సీపట్నం సరస్వతి ప్రెస్ సెంటర్ వద్ద ఎస్ఎస్ స్టోర్స్ షాపు, ఖజ్జిష్ట బజార్ సూటపల్లి బంగార్రాజు షాపు, అనకాపల్లిలో బండి గాడి వీధిలో కొప్పాక శ్రీనివాసరావు షాపుల్లో ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని తెలుపు రేషన్ కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో విత్తన శుద్ధి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో విత్తన శుద్ధి చేయడం ద్వారా చీడపురుగులను తెగులు నుండి పంటను రక్షించుకోవచ్చని ఏపీసీఎన్ఎఫ్ రీజనల్ ట్రైనింగ్ ఆఫీసర్ శ్యాంసుందర్ చెప్పారు. హరిపాలెం గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద సామూహిక వరి విత్తన శుద్ధి కార్యక్రమాన్ని శనివారం వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజామృతం తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది నాయుడు బాబు, రైతులు పాల్గొన్నారు.

ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం : రైవాడ రిజర్వాయర్ కుడి కాలువ ఆయకట్టు భూములకు నీరు అందించాలని కోరుతూ సోమవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన జరుగు ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను మండలంలోని లక్కవరంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన మోహన్రావు మాట్లాడుతూ మండలంలోని గవరవరం, లక్కవరం, ఖండిపల్లి, రేవళ్ళ, జుత్తాడ, సింహాద్రిపురం, చోడవరం గ్రామాల్లో సుమారు 3000 ఎకరాలకు నీరు అందించకపోవడం దారుణమన్నారు. సోమవారం ధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో రైతులు వేచలపు నారాయణ మూర్తి, బండారు.అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా దాడి రత్నాకర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కస్పా వీధిలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి శ్రీదేవి జెజె బాబు దంపతులు, కోటిపల్లి శ్రీను ఆధ్వర్యంలో నిరుపేద మహిళలు 60 మందికి ఐదు కేజీలు రైస్ బాగ్గను 81 వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య రాంబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు.



రత్నాకర్ దంపతులను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

కార్యక్రమంలో నాగోజ అప్పారావు, పీలా శ్యామ్, తణుకు రవి, ఎస్.నాగు పాల్గొన్నారు. 81వ వార్డ్ కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య రాంబాబు ఇంటి వద్ద వైసీపీ యువ నాయకులు కాండ్రేగుల శ్రీరామ్ సహకారంతో 100 నిరుపేదలకు, వికలాంగులకు పది రోజులు సరిపడా నిత్యావసర వస్తువులను, బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పీలా శ్యామ్, దాడి ఈశ్వరరావు, కాండ్రేగుల సుబ్రమణ్యం, బుజ్జి పాల్గొన్నారు. 80వ వార్డు రాజుపాలెంలో వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మెడికవర్, పద్మావతి ఆర్థోపెడిక్ సెంటర్ డాక్టర్ వసంత్ కుమార్ అనకాపల్లి శంకర్ ఫౌండేషన్ రాజా ఆప్టికల్స్ సిబ్బంది పాల్గొని బిపి, షుగర్ పరీక్షలు, ఈసీజీ, స్త్రీలకు ప్యాప్స్ మీర్ టెస్టులు ఉచితంగా చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరానికి హాజరైన వారికి టిఫిన్లు, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రేజాక మధుబాబు, సిహెచ్ అప్పలనాయుడు, జె చిరంజీవి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిరసన



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జివిఎంసి అనకాపల్లి జోన్ పరిధిలోని మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జివిఎంసి ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన శనివారం జోనల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం జోనల్ కమిషనర్ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు పి వెంకటరెడ్డి మాట్లాడుతూ అనకాపల్లి జోన్ పరిధిలో డెత్, రిటైర్మెంట్, లాంగ్ సిక్కు పోస్టులను వారసులతో భర్తీ చేయాలని, పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జివిఎంసిలో విలీనం కాకముందు సుమారు 450 మంది శానిటేషన్ కార్మికులు పనిచేసేవారని, విలీనం తర్వాత అనకాపల్లి జోన్‌లో జనాభా, పట్టణ విస్తరణ పరిధి పెరిగిందని, దానికి తగ్గ వర్కర్లను పెంచాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా నేడు శానిటేషన్ వర్కర్లు తగ్గారని తెలిపారు. ప్రస్తుతం పర్మినెంట్ కార్మికులు 110 మంది, కాంట్రాక్ట్ కార్మికులు 100 మంది మాత్రమే పని చేస్తున్నారని, దీంతో వారిపై పని భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో ప్రకారం సచివాలయానికి 12 మంది ఉండాల్సి ఉండగా, ముగ్గురు నుంచి ఐదుగురు మాత్రమే ఉన్నారని తెలిపారు. వీరితో పాటు మలేరియా, వాటర్, ఎలక్ట్రికల్, యానిమల్ హస్బెండ్రీ అసిస్టెంట్ పోస్టులు కలిపితే 250కి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పారిశుధ్యం సక్రమంగా జరగాలంటే వీటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గంటా శ్రీరామ్, ఎ.బాలకృష్ణ యూనియన్ నాయకులు వై.ఏసురాజు, బొమ్మల రాము, నిమ్మకాయల అజయ్, వాసు, నూకరాజు, బొమ్మల నాగరాజు, సత్యనారాయణ, గోవింద, రమణమ్మ, శివకుమార్ పాల్గొన్నారు.

డైట్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో మిషన్ లెర్నింగ్లో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం సెక్షన్-1 జూలై 1నుండి 10వ తేదీ వరకు సెక్షన్-2 జూలై 8 నుంచి 15 వరకు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్స్ గా ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం,శ్రీనివాస్, రాధాకృష్ణ, రామ్మూర్తి, రామలింగ స్వామి, సుజిత్ దాస్, అమెజాన్ నుంచి డాక్టర్ రవికుమార్, ఎన్ఐటికె నుంచి డాక్టర్ సుశీల్ కుమార్, ట్రిబుల్ ఐటీ కర్నూల్ నుంచి డాక్టర్ ప్రణీతశ్రీ పాల్గొన్నారు. కో ఆర్డినేటర్గా సిఎస్సి విభాగాధిపతి డాక్టర్ కె.సుజాత, ఎన్ఐటి వరంగల్ నుంచి డాక్టర్ ఎం శ్రీనివాస్ వ్యవహరించారు. ఇందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, పైథాన్ సూపర్వైజర్, అన్ సూపర్వైజర్ టెక్నిక్స్ వంటి అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఐటి, ఎన్ఐటి, ఏయు, జేఎన్టీయూ, నేషనల్ ఇనిస్టిట్యూట్ నుంచి ఫ్యాకల్టీ పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు వారిని అభినందించారు.

మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి- దేవరాపల్లి : వైయస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో ఎంపీపీ, కిలపర్తి రాజేశ్వరి చేతుల మీదుగా శనివారం మొక్కలు పంపిణీ చేశారు. వెలుగు కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ప్రతి ఒక్క స్వయం సహాయక సంఘానికి మూడు రకాల మొక్కలను అందించినట్లు చెప్పారు. మండలంలో 1468 సంఘాలకు 4464 మొక్కలు అందజేసినట్లు చెప్పారు. ఇందులో కొబ్బరి 1071, మామిడి 765, నిమ్మ 373, జీడి 115, సీతాఫలం 102, సపోటా 690, బత్తాయి 415, చింత 35, జామ 898, మొక్కలు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎం.లక్ష్మి, ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి, వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్ రావు, సీసీలు, వివోఏలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కశింకోట : రోడ్డు భద్రతపై విద్యార్థులతో కశింకోటలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమం ఏపిఎమ్ శ్రీనివాసరావు, ఏఎస్ఐ పి.సుధా, పాఠశాల హెచ్ఎం అప్పారావు, పిడి ప్రభాకర్ రావు, సిసి సత్యనారాయణ, విఓఏలు రాము, ప్రసన్న భారతి, పద్మావతి, వరలక్ష్మి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.హేమంత్ తెలిపారు. తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాపుశెట్టివాని పాలెం సబ్ సెంటర్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఆసుపత్రి రికార్డులను, మందులు, డయాగ్నస్టిక్స్ పరిశీలించారు. ఈ-ఆశ యాప్ గురించి సిబ్బందికి సూచనలు చేశారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్, కమ్యూనికబుల్ డిసీజెస్ సర్వే, గర్భిణుల ఆబా ఐడి లింకేజ్ గురించి వివరించారు. కార్యక్రమంలో పిహెచ్సి వైద్యాధికారిణి డాక్టర్ నజరత్ షమీం, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా మార్ట్ ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలో రూ.35 లక్షలతో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా మార్ట్‌లో తక్కువ ధరకు నాణ్యమైన కిరాణా, ఫ్యాన్సీ వస్తువులు లభిస్తాయన్నారు. సెర్ప్ సిఈఓ మహమ్మద్ ఇంతియాజ్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు ఈ మార్ట్‌ల ద్వారా బ్రాండెడ్ కంపెనీల వస్తువులు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి ఎండికె వి నాంచారయ్య, ప్రాజెక్టు డైరెక్టర్ బి.లక్ష్మీపతి, ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, జెడ్పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైసీపీ నేతలు సబ్బవరపు ముత్యాల నాయుడు, సబ్బవరపు నారాయణ మూర్తి, వెలుగు ఏపీఎం సాయి రమేష్ పాల్గొన్నారు.

17న డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - యలమంచిలి : స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ 17వ తేదీ సోమవారం జాబ్ మేళా నిర్వహించడం జరుగుతోందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. చంద్రశేఖర్ తెలిపారు. వసుధ ఫార్మా అచ్యుతాపురం యూనిట్లో ఉద్యోగులుగా పనిచేయడానికి ఆసక్తి గల బిఎస్సీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పురుష అభ్యర్థులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపికైన బిఎస్సీ అభ్యర్థులకు ఏడాదికి రూ.2.12 లక్షలు, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ అభ్యర్థులకు రూ.2.48 వేతనం, ఉచిత భోజన, వసతి, ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9542135995 ను సంప్రదించాలని కోరారు.

'నేను ఇవ్వను.. నీ ఇష్టమొచ్చిన పని చేసుకో'

జగనన్న ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని ప్రశ్నించిన మాజీ ఉప సర్పంచ్‌పై ఎమ్మెల్యే రమణమూర్తిరాజు దురుసు ప్రవర్తన

ప్రజాశక్తి -మునగపాక రూరల్

రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ జగనన్న ఇళ్ల స్థలాలు ఇచ్చినట్లు ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు, ఎమ్మెల్యేలు ఊదరగొడుతుంటే... ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని ప్రశ్నించిన మాజీ ఉప సర్పంచ్‌పై యలమంచిలి ఎమ్మెల్యే దురుసుగా ప్రవర్తించారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమానికి యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు వచ్చారు. ఈ సందర్భంగా జగనన్న ఇళ్ల స్థలాలపై ఆ గ్రామ మాజీ ఉపసర్పంచ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ప్రశ్నించారు. గ్రామంలో 94 మందికి జగనన్న ఇళ్ల స్థలాల లిస్టు ప్రకటించారు తప్ప నేటికీ వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అంతే ఎమ్మెల్యేగారికి కోపం పొడుచుకొచ్చింది. గనిశెట్టిపై ఒంటి కాలు మీద లేచారు. 'నేను ఇవ్వను గాక ఇవ్వను.. నీ ఇష్టం వచ్చిన పని చేసుకో'. నీతో మాట్లాడే అవసరం నాకు లేదు' అంటూ కోపంతో ఊగిపోయారు. దురుసుగా అక్కడి నుండి కారుపై వెళ్లిపోయారు. ఎమ్మెల్యే ప్రవర్తనతో అక్కడున్నవారు దిగ్భ్రాంతికి లోనయ్యారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన ఎమ్మెల్యే ప్రశ్నించేవారిపై నోరు పారేసుకోవడం, దురుసుగా మాట్లాడటం తగదని హితవుపలికారు. లిస్టు ప్రకారం గ్రామంలోని 94 మంది లబ్ధిదారులకు తక్షణమే జగనన్న ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.



గనిశెట్టిపై చెయ్యి చూపుతూ దురుసుగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆగస్టు 15న కలెక్టరేట్ల వద్ద నిరసన

ప్రజాశక్తి- అనకాపల్లి

పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఆగస్టు 15న అన్ని కలెక్టరేట్లు, తహశీల్దారు కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కాళ్ల తేలయ్య బాబు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జూన్ 27న మహారాష్ట్ర సెహగాన్ పట్టణంలో ఆల్ ఇండియా కోఆర్డినేటర్స్ కమిటీ మూడవ జాతీయ సదస్సులో తీసుకున్న నిర్ణయాల మేరకు ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. పింఛన్లు పెంచకుంటే బిజెపికి ఓటు వేయరాదనిసెప్టెంబర్‌లో ప్రచారం నిర్వహిస్తామని, వారం రోజులపాటు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద గేటు మీటింగులు ఏర్పాటు చేసి నిరసన తెలియజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కెపి కుమార్, ఆర్ రంగారావు, సిహెచ్ రామారావు, వై వీర్రాజు, ఆర్ సత్యనారాయణ, కే సంజీవరావు పాల్గొన్నారు.

వడ్డాదికి ఎమ్మెల్యే చేసింది శూన్యం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చేసిన అభివృద్ధి శూన్యమని టిడిపి పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్ ఆరోపించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రూ.80 లక్షలతో జంక్షన్లో నిర్మించిన డ్రైనేజీ కాలువలు నిరుపయోగమని, నీరు పారకుండా డ్రైనేజీలు నిర్మించారని, ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోతుందని తెలిపారు. తక్కువ ఎత్తులో కాజ్వే నిర్మించడం వలన వర్షాకాలంలో నీటి ప్రవాహానికి దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. వడ్డాదిలో ఇప్పటివరకు కళ్యాణ మండపం ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. జగనన్న ఇళ్ల మంజూరులో వైసిపి నేత అవినీతికి పాల్పడినా ఎమ్మెల్యే పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు జి కోటేశ్వరరావు, మాజీ ఎంపిటిసి దొండా శ్రీను, సాయం శేషు, సిరిగిరి శెట్టి శ్రీరామ్‌మూర్తి పాల్గొన్నారు

నేరాల నివారణకు సమన్వయంతో పని చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో నేర నియంత్రణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పి కెవి మురళీకృష్ణ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో శనివారం నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ, తీవ్రమైన కేసులు, ప్రాపర్టీ, పోక్సో యాక్ట్ కేసులు, 174 సిఆర్‌పిసి కేసులు, గంజాయి, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఆస్తి దొంగతనాల కేసులు నివారణకు రాత్రి/పగలు గస్తీలను పునర్వ్యవస్థీకరించి, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంపై అవగాహన పెంచాలని సూచించారు. అనకాపల్లి 10వ ఎడిజె కోర్టు అదనపు పీపీ వడ్డాది వెంకట్రావుతో గంజాయి కేసులలో దర్యాప్తులో ఉపయోగపడే సూచనలు ఇప్పించి, దర్యాప్తులో తలెత్తే అనుమానాలను నివృత్తి చేయించారు.

ప్రభుత్వ పథకాలతో మరింత అభివృద్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో జిల్లా అన్ని రంగాలలో మరింత ముందుకు వెళ్లేందుకు కృషి చేయాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి వి సత్యవతి అధికారులను కోరారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వికేంద్రీకరణ చేయడం మూలంగా సంక్షేమ కార్యక్రమాల అమలు వేగవంతమైందన్నారు. రాజ్యాంగ వ్యవస్థకు లోబడి కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్ర, జిల్లా, గ్రామ స్థాయికి వేగంగా చేరుకుంటున్నాయన్నారు. రానున్న కర్మాగారాలను బట్టి కౌశల్ వికాస్ యోజనలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వాలని తద్వారా ఉపాధి అందించాలని కోరారు. ఈ సమావేశంలో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, డ్వామా పిడి సందీప్, సిపిఓ రామారావు, ఇరిగేషన్ ఎస్ఈ వీరన్నాయుడు, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ హేమంత్, డిసిహెచ్ ఎస్ శ్రావణ్ కుమార్, హౌసింగ్ పీడీ రమామణి, వ్యవసాయ శాఖ జెడి మోహన్ రావు, డిఆర్‌డిఎ పిడి డైజీ, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం శ్రీధర్, ఎల్‌డి ఎం.సత్యనారాయణ, హార్టికల్చర్ ఏడి ప్రభాకర్‌రావు వివిధ మండలాల ఎంపీపీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంఇఒ రవీంద్రబాబుకు ఘనసత్కారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల విద్యాశాఖాధికారిగా సుదీర్ఘకాలం పనిచేసి బదిలీపై వెళ్లిన సిహెచ్ రవీంద్రబాబు దంపతులను మండల ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించింది. శనివారం స్థానిక ద్రోణంరాజు కల్యాణ మండపంలో జరిగిన ఆత్మీయ అభినందన సమావేశంలో మాజీ ఎంపిపి, కిలపర్తి భాస్కరరావు, జెడ్పిటీసీ కర్రి సత్యం, ఎంపీడీఓ సిహెచ్ సుబ్బలక్ష్మి, ఇన్‌ఛార్జి ఎంఈఓ బి.పడాల్ దాస్, ఎంఈఓ-2 ఉషారాణి, స్థానిక సర్పంచ్ సబ్బవరం పెంటమ్మ మాలిబాబు తదితరులు రవీంద్రబాబు దంపతులను సాలువతో సత్కరించి మెమోంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో నౌడు అప్పారావు, మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రవీంద్రబాబును సత్కరిస్తున్న దృశ్యం

ట్రిపుల్ ఐటికి రోహిత్ ఎంపిక



ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం హైస్కూల్ విద్యార్థి వానపల్లి రోహిత్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యాడు. ఈ మేరకు సదరు విద్యార్థిని శనివారం అభినందించారు ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి సుమన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆటలు పాటలు కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని బయ్యావరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బయ్యావరం గ్రామానికి చెందిన సిద్ది రెడ్డి అప్పారావు తరపున, ఆయన కుమారుడు మధురవాడ యూనియన్ బ్యాంక్ మేనేజర్ సిద్దిరెడ్డి సతీష్ శనివారం ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. ఇంగ్లీష్ మీడియంలో ఉరుగటి కాసులమ్మకు రూ.5వేలు, రెడ్డి సందీప్‌కు రూ.3వేలు, తెలుగు మీడియంలో చందక పావనికి రూ.5వేలు, సిహెచ్.దినేష్‌కు రూ.3వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ రమణ, ఉపాధ్యాయులు ఎన్ నాగేశ్వరరావు, ఏ సరోజిని, ఎస్ రమేష్, పుష్పలత, ఎం అప్పారావు, జిఎస్ రత్నకుమార్, ఏ ప్రసాద్, నంబరు సత్యారావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

58 పనులపై సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని 27 పంచాయితీలలో గత ఏడాది ఏప్రిల్ నెల నుంచి ఈ ఏడాది మార్చి నెల వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై అన్ని గ్రామాలలో ఈ నెల 30 వరకు సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి శనివారం ఒక ప్రకటనలు పేర్కొన్నారు. ఈ ఏడాది పనులకు గాను రూ.20,37,26299 ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ మొత్తం సొమ్ముపై ఈ నెల 31న ప్రజా వేదిక నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

నేడు యానాద్రి అమ్మవారి పుట్టుక మహోత్సవం

ప్రజాశక్తి - యలమంచిలి : స్థానిక ఎస్ఆర్ కాలనీ యానాద్రి అమ్మవారి పుట్టుక మహోత్సవాలు ఆదివారం నిర్వహించడానికి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. వేలాది మంది భక్తులు దర్శించే అమ్మవారి గుడి ప్రాంతం దారి పొడవునా విద్యుత్ కాంతులతో స్వాగతం పలకడానికి విద్యుత్ తోరణాలు అమర్చారు. అమ్మవారి గుడిని రంగులతో సుందరంగా అలంకరించారు. దర్శనాలకు బారికేడ్లు నిర్మించారు. నేల వేషాలు, కోలాటాలు, చెక్క భజనలు నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వహకులు తెలిపారు.

సిసి డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామంలో కొణతాల వారి దిబ్బవీధిలో లక్ష యాభై వేల రూపాయలతో సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, అన్నపూర్ణ బ్యాంక్ చైర్మన్ పిడి గాంధీ, సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్న , దంతులూరి కళ్యాణ బాబు, వార్డు మెంబర్లు ఎంపీటీసీలు, పంచదార్ల కన్నారావు పాల్గొన్నారు.

తప్పులతడకగా సమగ్ర భూసర్వే

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలో సమగ్ర భూ సర్వే తప్పులు తడకగా ఉందని జిల్లా పేద ప్రజల హక్కుల పరిరక్షణ సమితి కన్వీనర్ ఆకుల నాగేశ్వరరావు ఆరోపించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మొదట విడతగా 15 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే జరిపి పట్టాదారు పాసు పుస్తకాలు రైతులకు అందజేశారని, చాలా గ్రామాల్లో సాగుబడి ఒకరి పేరుమీద పాస్ బుక్స్ మరొకరు పేరు మీద ఇచ్చారని తెలిపారు. భూములు విస్తీర్ణంతో పాటు యజమానులు పేర్లు ఫొటోలు కూడా మార్పులు చేర్పులు జరిగాయన్నారు. ఈ సమస్యల వలన భూమి సాగుదార్ల మధ్య ఘర్షణలు, కోర్టులు చుట్టూ తిరగాల్సి వస్తుందని పేర్కొన్నారు. పెదపూడి రెవెన్యూలో రీసర్వే అక్రమార్కులకు అనుకూలంగా జరిగిందన్నారు. ఆ గ్రామంలో స్థానికేతరులకు ప్రభుత్వ భూములలో పట్టాలిచ్చారని తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. పరవాడలో నివాసం ఉంటున్న కొందరి అనర్హుల పేర్లు రీసర్వేలో మళ్లీ నమోదు చేశారని, సర్వేలో తప్పులు సవరించాలని, భూ యజమాని సమక్షంలోనే సర్వే నిర్వహించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తోటాడలో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : మండలంలోని తోటాడ ఆరోగ్య ఉపకేంద్రంలో వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సంధ్య రోగులను పరీక్షించారు. తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు మాట్లాడుతూ కంటి విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

మంచినీటి బోరు ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామంలో శ్మశానవాటికి వద్ద నూతనంగా తాగునీటి బోరు ఏర్పాటుకు జెడ్పిటిసి దొండా రాంబాబు శనివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్ జెర్రిపోతుల రామారావు, మాజీ సర్పంచ్ గొంపా అప్పారావు, మాజీ ఉపసర్పంచ్ అద్దేపల్లి రామారావు, యాదవ సంఘం నాయకులు వియ్యపు రామారావు పాల్గొన్నారు.

కల్యాణపు లోవ రిజర్వాయర్ ప్రహరీకి నిధులు మంజూరు

ప్రజాశక్తి-అనకాపల్లి : చోడవరం నియోజకవర్గం రావికమతం మండలం కళ్యాణపులోవ రిజర్వాయర్ ప్రహరీ నిర్మాణానికి రూ.9.50 లక్షలు మంజూరు చేసినట్టు ఎంపీ డాక్టర్ బివి సత్యవతి పేర్కొన్నారు. శనివారం ఆమె మంజూరు పత్రాన్ని రిజర్వాయర్ చైర్మన్, గ్రామస్తులకు అందజేశారు. ప్రహరీ గోడ నిర్మాణం వలన 10 గ్రామాల రైతులకు చెందిన 4,900 ఎకరాల భూమికి సాగునీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ రాము నాయుడు, మాజీ సర్పంచ్‌లు రాజారావు, గాలి రామారావు, మత్స్యవానిపాలెం సర్పంచ్ గణేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పెదపూడి శివారు పంగిడి, రాజుపాలెం, కృష్ణానగర్, ఎస్ఎల్ నగర్ గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ శనివారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలోని అంగనవాడీ సెంటర్లో శనివారం ఏడు నెలల పసిపిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాతా, శిశువులకు గుడ్లు, పాలు సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అంజలి, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

గ్రోయిన్ల మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని శారదా నదిపై ఉన్న 14 గ్రోయిన్లకు మరమ్మతులు చేయలేని అసమర్ధ మంత్రిగా గుడివాడ అమర్నాథ్ నిలిచిపోతారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు. శనివారం మండలంలోని శారదా నదిపై ఉన్న గ్రోయిన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నీటిపారుదల వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందన్నారు. వ్యవసాయ రంగం, రైతులపై ఈ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో ఈ ఆనకట్టలు, గ్రోయిన్లను చూస్తే అర్థమవుతుందన్నారు. ఇసుక దోపిడీపై ఉన్న శ్రద్ధ పంటలకు నీరు అందించాలని ఈ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. తగరంపూడి, సీతానగరం, తుమ్మపాల, చెర్లోపల్లి, ఎల్లయ్య, నాగులపల్లి గోడారి గ్రోయున్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వీటిని వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి -పాయకరావుపేట: మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పాయకరావుపేట శాసనసభ్యులు గొల్ల బాబూరావు తెలిపారు. మండలంలోని పాల్మన్‌పేట పంచాయతీ పరిధిలో గడపగడపకు కార్యక్రమంలో భాగంగా శనివారం సర్పంచ్ కోడా కోటేశ్వరరావు, గ్రామ శాఖ అధ్యక్షులు బొడ్డు హరిబాబు, వాలంటీర్ల కన్వీనర్ మైలపల్లి శివాజీ, ఆధ్వర్యంలో పర్యటించారు. కాలనీలో డ్రైనేజీలు, సిసి రోడ్లు, ఇళ్ల స్థలాల సమస్యలపై పలువురు ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సీసీ రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే గ్రామంలో డ్రైనేజీల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిటీ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, వైఎస్ఆర్ పార్టీ సీనియర్ నాయకులు జగతా శీను, మోస శ్రీను, సూరాడ గోపి, ఎంపిటిసి మహంకాళిమ్మ, మత్స్యకార డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, మైలపల్లి అశోక్ చక్రవర్తి, స్కూల్ చైర్మన్ మైలపల్లి కాసులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

పథకాలు అందేలా చర్యలు : ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీ ఆరో వార్డులో శనివారం గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ నిర్వహించారు. సంక్షేమ పథకాలు సాంకేతిక కారణాలతో లబ్ధి పొందలేని వారి వివరాలను అక్కడికక్కడే వాలంటీర్లతో నమోదు చేయించారు. సమస్యలు పరిష్కరించి పథకాలు అందేలా చర్యలకు ఆదేశించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మళ్ల గణేష్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు కౌన్సిలర్ యాదగిరి మణి, వార్డ్ ఇంచార్జ్ యాదగిరి శేషు, వైస్ చైర్మన్ లు తమరన అప్పలనాయుడు, కోనేటి రామకృష్ణ, జగనన్న సచివాలయల కన్వీనర్ తమరానా శ్రీను, శాలివాహన కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ అర్జున, ముస్లిం సంచార జాతుల స్టేట్ డైరెక్టర్ చోటి, మున్సిపల్ కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, నరసింహమూర్తి , కో ఆప్షన్ కౌన్సిలర్ రోజా, వైసిపి నాయకులు నాగు, వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలు గణమ్మ, ప్రధాన కార్యదర్శి లలిత, టౌన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, స్వామి పాల్గొన్నారు.


ఆందోళన చేపడుతున్న నాయకులు

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి -రావికమతం: చోడవరం- నర్సీపట్నం రహదారి పనులను తక్షణమే చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో శనివారం సిపిఐ శ్రేణులు, రైతులు నాలుగు రోడ్ల కూడలి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటర మణ మాట్లాడుతూ, చోడవరం నుంచి నర్సీపట్నం వెళ్లే రోడ్డు శిధిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టలేని అసమర్థ నాయకులు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన్నదొర, దొరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డిపల్లి అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు శివలింక కొండలరావు, సిపిఐ మండల కార్యదర్శి జోగిరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

ఓటర్ల జాబితాపై ఆర్‌డిఒ సమీక్ష

ప్రజాశక్తి-గొలుగొండ:మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి జయరాం ఓటర్ల జాబితాపై బూత్ లెవెల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటర్ల నమోదు చేయాలని ఆదేశించారు. ఓటర్ నమోదు లో ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలని మండల డిప్యూటీ తహశీల్దార్ జి.ఆనందరావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డివిజన్ ఓటర్ల జాబితా డిప్యూటీ అధికారి సుధవాణి, ఆర్‌వి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఆర్థిక సంఘం నిధులు పక్కదారి

ప్రజాశక్తి-రోలుగుంట:వైసిపి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తోడ్పాటు నివ్వకపోగా 14, 15 ఆర్థిక సంఘం నిధులు పక్కదారి పట్టిస్తూ పంచాయతీలను నిర్వీర్యం చేస్తుందని రోలుగుంట ఎంపిటిసి సుర్ల రామకృష్ణ, సర్పంచ్ కె.రామలక్ష్మి ఆరోపించారు. శనివారం స్థానిక పాల కేంద్రం వద్ద జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, రోలుగుంట గ్రామంలో ఏమి అభివృద్ధి చేశారో ఎమ్మెల్యే ధర్మశ్రీ చెప్పాలన్నారు. కల్వర్టు, రోడ్డు గానీ వేశారా అని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు.రోడ్డు మీద అడుగుపెడితే గోతు లేనని విమర్శించారు. రోలుగుంట గ్రామానికి తాగునీటి సమస్య తీర్చలేదన్నారు.

ఏపీ పీజీ సెట్‌లో విద్యార్థుల సత్తా


ర్యాంకులు సాధించిన స్పేసెస్ డిగ్రీ కాలేజ విద్యార్థులు

ప్రజాశక్తి- పాయకరావుపేట: ఏపీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రెన్స్(ఏపీ పీజీ సెట్ ఫలితాలలో శ్రీ ప్రకాష్ అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. కెమిస్ట్రీ విభాగంలో కె.రేష్మ 5వ ర్యాంకు, ఎస్.శృతి 32వ ర్యాంకు, జువాలజీ విభాగంలో ఈ.పార్థసారథి అయ్యంగార్ 52వ ర్యాంకు, ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఎస్ఎస్ డి. వరప్రసాద్ 42వ, కంప్యూటర్స్ విభాగంలో కే.సౌమ్య 51వ, సైకాలజీ లో అంబటి ఆదిత్య నాగ లహరి 66వ, లైఫ్ సైన్స్ విభాగంలో టీ.సౌజన్య 128వ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు తెలిపారు. ఈ సందర్భంగా తమ కళాశాలలో బ్యాచిలర్ డిగ్రీతో పాటు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడంతో తమ విద్యార్థులు ఇంత మంచి ర్యాంకులు సాధించారని ఆయన తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులకు విద్యా సంస్థల అధినేత సిహెచ్ .వి కే. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సి.హెచ్ విజయ్ ప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ పి.సుబ్బారావు అభినందనలు తెలియజేశారు.

ఉత్తమ ఫలితాలలో రిషి

నర్సీపట్నం టౌన్: ఏపిపిజి సెట్‌లో స్థానిక రిషి కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. ఇంగ్లీషు విభాగంలో గంగోత్రి 6వ ర్యాంకు, హిస్టరీ విభాగంలో ఆదిత్య 20మ, ఫిజిక్స్‌లో దుర్గా భవాని 66వ, ఇంగ్లీషులో ఇంద్రావతి 91వ ర్యాంకు, మ్యాథ్స్‌లో పి. వర్షిణి 92వ ర్యాంకు సాధించారు. వీరిని కరస్పాండెంట్ కె.సతీష్, డైరెక్టర్ ఆర్‌వై నాయుడు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

సహకార సంఘాలను ప్రయివేటు పరం చేయొద్దు

పిఎసిఎస్ జిల్లా అధ్యక్షులు నాగభూషణం



ప్రజాశక్తి -పాయకరావుపేట:సహకార సంఘాలను ప్రైవేట్ పరం చేయరాదని, ప్రభుత్వం చట్ట సవరణ రద్దు చేయాలని పిఎసిఎస్ జిల్లా అధ్యక్షులు పినపాత్రుని నాగభూషణం తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, విజయవాడలో జరిగే మహా ధర్నాకు జిల్లాలోని అన్ని ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు హాజరు అవ్వాలని పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో ఈ మహా ధర్నా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పని చేస్తున్న 7500 మంది ఉద్యోగులు అపరిష్కృత సమస్యలు, కొత్త వేతన సవరణ బిల్లు, జీతాల అమలు, సిబ్బంది జీతాలు వంటి ఎన్నో సమస్యలు ఉన్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో వ్యవస్థ మనుగడే ప్రశ్నార్థంగా మారిందన్నారు. జీవో నెంబర్ 2 లో ఎంఎస్ నెంబర్ 36 ప్రకారం వేతనాలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యువిటీ చట్టప్రకారం ఇవ్వాలన్నారు.ఏ డిపార్ట్మెంట్లోనూ లేని విధంగా ఒక్క మన జిల్లాలో మాత్రమే సిబ్బంది జీతాలు డ్యూలో పెడుతున్నారన్నారు. సహకార సంఘాల్లో 2019 తర్వాత నియమించబడిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఇన్కమ్ టాక్స్ పరిధి నుండి సహకార సంఘాలను మినహాయించాలన్నారు. ఈ సమస్యల సాధనకు సోమవారం విజయవాడలో మహాధర్నాకు జిల్లాలోని ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు హాజర కావాలని పిఏసిఎస్ జిల్లా అధ్యక్షులు పిన పాత్రుని నాగభూషణం కోరారు.

నిధుల మంజూరులో అన్యాయం

ప్రజాశక్తి-రావికమతం:ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులలో కవగుంట గ్రామ పంచాయతీకి పూర్తిగా అన్యాయం జరిగిందని సర్పంచ్ దాసరి సూర్యకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, సుమారు 2000 జనాభా కలిగి ఎస్సీ, ఎస్టీ గిరిజన గ్రామమైన కవగుంట గ్రామ పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం బేసిక్, టైడ్ ఫస్ట్ ఇన్స్టాల్మెంట్ కింద 63,450 మంజూరు కావడం చాలా హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా ఏ పంచా యతీకి కూడా 1,50,000 తక్కువ లేకుండా అత్యధికంగా 22 లక్షల వరకు వచ్చాయన్నారు. తక్కువ నిధులతో ఏమి చేయాలన్నారు.


సర్పంచ్ సూర్యకుమారి

రేడియోగ్రాఫర్‌ను నియమించాలి : సిపిఎం

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో రేడియోగ్రాఫర్‌ను వెంటనే నియమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేసారు. గత వారం రోజులుగా ఆసుపత్రిలో రేడియోగ్రాఫర్ లేనందున ఎక్స్ రే రూమ్ మూత పడిందని, దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారం రోజుల నుండి ఎక్స్ రేలు తీయడం నిలిచి పోయాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎక్స్ రే మిషన్ తరచూ మరమత్తుకు గురవుతుందని, కొత్తగా ఏర్పాటు చేయాలన్నారు. అనకాపల్లిలో వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం సిబ్బంది నిర్లలకు శనివారం సమస్యను విన్నవించి వినతిపత్రం అందజేయడం జరిగిందని తెలిపారు. సిపిఎం నాయకులు బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న అప్పలరాజు

ఎమ్మెల్యే కృషితోనే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గణేష్ కృషితోనే సమస్యలు పరిష్కారం అయ్యాయని గొలు గొండ మండలం వైసిపి నాయకులు తెలిపారు. 40 ఏళ్లుగా పరిష్కారం కానీ ఎన్నో సమస్యలను ఎమ్మెల్యే పరిష్కరించారని గొలుగొండ మండల వైసిపి నాయకులు, కొత్త ఎల్లవరం పంచాయతీ ఎంపిటిసి వలగల పెద్ద దేవుడు పేర్కొన్నారు. స్థానిక కళ్యాణ మండపం వద్ద శనివారం విలేకర్లతో మాట్లాడుతూ, ఆర్ది అటవీ ప్రాంతం రోడ్డు విస్తరణకు నోచుకుందని అన్నారు. సీనియర్ నాయకులు రామకృష్ణ, కొల్లి శ్రీను , సామరెడ్డి లోవరాజు మాట్లాడుతూ, కొత్త ఎల్లవరం ఇనాం భూ సమస్యలపై ఎమ్మెల్యే ఆర్డీవోతో సమీక్షించారన్నారు. నెల రోజుల్లో పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారన్నారు.


మాట్లాడుతున్న వైసిపి నేతలు

సామగ్రి అందజేత

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:సోషల్ వెల్ఫేర్ సంక్షేమ హాస్టల్ చదువుతున్న విద్యార్థుల కు పెన్నులు, స్కేల్స్ వంటి 13 రకాల సామాగ్రిని నర్సీపట్నం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్యామల శనివారం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు అందజేశారు. నర్సీపట్నం సోషల్ వెల్ఫేర్ ఆఫీసులో వీటిని పంపిణీ చేశారు. సుమారు వెయ్యి మంది విద్యార్థులకు అవసరమయ్యే సామాగ్రిని ప్రభుత్వం సరఫరా చేసిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యుఓలు, రామ సత్యనారాయణ, ఎస్ కె రహమాన్ పాల్గొన్నారు.


సామగ్రి ఇస్తున్న శ్యామల

కొనసాగిన రిలే దీక్షలు

ప్రజాశక్తి -కోటవురట్ల: పాఠశాల, రోడ్డు నిర్మాణం చేపట్టాలని అణుకు గ్రామ గిరిజనులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. తమ న్యాయమైన కోరికలు తీర్చాలంటూ అణుకు గ్రామస్తులు దీక్షా శిబిరంలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు డేవిడ్ రాజు మాట్లాడుతూ, ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బోరు మరమ్మతు పనులు

ప్రజాశక్తి -రావికమతం:మండలంలోని కవగుంట గ్రామ పంచాయతీలో చేతిబోరు మరమ్మతు పనులను శనివారం సర్పంచ్ దాసరి సూర్య కుమారి ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామంలో రొబ్బా చిన కల్యాణం దొర పశువుల పాకల సమీపంలో బోరు పైపులు రంధ్రాలు పడటంతో నీరు సరిగా రాకపోవడంతో 15 మంది పశువుల పాకలకు సంబంధించిన రైతులు మంచినీటికి ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.


చేపడుతున్న బోరు పనులు

మహిళలపై హింసను అరికట్టేందుకు నిపుణులతో కమిటీ వేయాలి

28 నుంచి పోరు యాత్ర : ఐద్వా

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు నిపుణులతో కమిటీ వేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. చేయి చేయి కలుపుదాం, హింస లేని సమాజం నిర్మిద్దాం, మద్యం, మత్తు పదార్థాలను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించాలి, హింస నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయాలని సమావేశం కోరింది. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో శనివారం ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య వక్తలుగా విచ్చేసిన ప్రముఖ న్యాయవాది, ఐలూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బివి.రామాంజనేయులు, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.పద్మ మాట్లాడుతూ, మారే కాలంతో పాటు మహిళలపై హింస విపరీతంగా పెరుగుతుందన్నారు. అసమానతలు, అవమానాలు, అత్యాచారాలు రక రకాల కొత్త రూపాలలో నారీ లోకాన్ని ఆవేదనకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. చట్టాలు ఉన్నప్పటికీ అవి అరకొరగానే ఉన్నాయన్నారు. విశాఖ నగరంలో కూడా ఇటువంటి కేసులు రోజుకు 15 నుంచి 20 వరకు దిశ పోలీసుస్టేషన్‌లో నమోదు అవుతున్నాయని పేర్కొన్నారు. వర్మ కమిషన్ సిఫారసు ప్రకారం ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన నేరస్తులకు శిక్ష పడాలని, శిక్షాకాలం పెంచాలని, పోలీస్ యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయాలని కోరారు. రాజకీయ నాయకులు జోక్యం ఉండరాదన్నారు. జిల్లాకు రక్షణాధికారిని నియమించాలని, మహిళా పోలీస్ స్టేషన్లు, మహిళా కోర్టుల సంఖ్య పెంచాలని డిమాండ్‌చేశారు.

మహిళల హింసపై ఐద్వా ఆధ్వర్యాన ఈ నెల 28 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు పోరు యాత్ర చేపడుతున్నట్లు సభాధ్యక్షురాలు వై. సత్యవతి తెలిపారు. ఆగస్టు 8న విజయవాడలో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు బి. పద్మ, ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జి.సూర్యప్రభ, జివి.పద్మావతి, వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ (సిఐటియు) కన్వీనర్ పి.మణి, విసిసి జిల్లా నాయకులు ఎ.మణి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వై.తులసి,ఐద్వా నాయకులు ఆర్.వరలక్ష్మి, కె.మణి, కె.కుమారి, బి.భారతి, గౌరి, ఎ.పుష్ప, ఎన్.విజయలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, కె.వేణు, ఆర్.విమల, సుజాత, కల్యాణి.వై తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు బివి.రామాంజనేయులు

పక్కాగా ఓటర్ల సర్వే

ప్రజాశక్తి -నక్కపల్లి:ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాకు సంబంధించి చేపట్టనున్న ఇంటింటా సర్వే పక్కగా నిర్వహించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం బూత్ లెవెల్ అధికారులు, సూపర్వైజర్లతో సమావేశ నిర్వహించారు. ఈనెల 21వ తేదీ నుండి వచ్చే నెల 21వ తేదీ వరకు బూత్ లెవెల్ అధికారులు ఇంటింటా సర్వే చేపట్టాలని సూచించారు. ఓటరు లిస్టు ప్రకారం ఓటర్లు ఉన్నారా లేదా పరిశీలించి నమోదు చేయాలన్నారు. అర్హులు ఉంటే ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సీతారామరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామలక్ష్మి



మాట్లాడుతున్న చిరంజీవి

సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి

ప్రజాశక్తి-రోలుగుంట:ఎస్సీ, ఎస్టీలకు సబ్ ప్లాన్ చట్టం అమలు చేసి, నిధులు ఖర్చు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని పోరాడి సాధించుకున్నారని, ఆ చట్టం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు అభివృద్ధి చేయాలన్నారు. సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో వారికి కేటాయించిన నిధులను ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణాలు, ఇతర పథకాలు ఏమీ అమలు కాలేదన్నారు. పేరుకు మాత్రం ఎస్సీ కార్పొరేషన్ ఉన్నాయని, వాటికి ఛైర్మన్లు ఉన్నారని ఎవరికి కూడా ఉపాధి లభించ లేదన్నారు. భవిష్యత్తులో దళితుల సమస్యలపై కార్పొరేషన్ సంక్షేమ పథకాలపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న సిఐటియు నేత రాజు

సమగ్ర సంక్షేమ చట్టం అమలు ఏదీ?

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: హమాలీలు(ముఠా) కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. శనివారం సిఐటియు జిల్లా అధ్యక్షులు అడిగర్ల రాజు మీడియాతో మాట్లాడుతూ,నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో సుమారు 1000 మంది వివిధ రకాల హమాలీ (ముఠా) పనులు చేస్తూ జీవిస్తున్నారని తెలిపారు. హమాలీ (ముఠా)పనులతోనే వ్యాపారం వృద్ధి చెందుతున్నాయని, దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేల కోట్ల రూపాయిల పన్నులు వస్తున్నాయన్నారు. హమాలీ(ముఠా) కార్మికులకు ప్రమాద భీమా, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీలు ప్రమాదాలకు గురైన సందర్భంలో కుంటుంబ పోషణకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అర్హులకు ఇళ్ళు, ఇళ్ల స్థలాలు, పెన్షన్లు కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం హమాలీ (ముఠా)కార్మిక సంఘం (సిఐటియు) ప్రెసిడెంట్ రుత్తల గోవింద్, కోశాధికారి ఎం. రమణ, రాము, రాజు, సాంబ, సత్తిబాబు, నాగేశ్వరరావు, అప్పారావు, తాతబాబు పాల్గొన్నారు.

దళిత కుటుంబంపై దాడి చేసిన వారిని శిక్షించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : దళిత కుటుంబంపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, కులం పేరుతో దూషించినందుకు అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు డిమాండ్ చేశారు. శనివారం ఎల్ఐసి సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోపాలపట్నం నేతాజీనగర్‌లో 70 ఏళ్లుగా నివాసముంటున్న దళిత కుటుంబాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని కులం పేరుతో దూషించి, భౌతిక దాడి చేయడం దుర్మార్గమన్నారు. 90 ఏళ్ల తల్లితో ఉంటున్న ముక్కు సుబ్బారావు కుటుంబంపై రాయుడు, రమణ, శ్రీను భౌతిక దాడి చేశారని, మరో 40 మంది కులం పేరుతో దూషించారని తెలిపారు. పోలీసుల ఎదురుగానే దాడి చేస్తున్నా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ గోపాలపట్నం నాయకులు ప్రసాద్, సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి చంద్రమౌళి, మత్స్యకారుల సంఘం నాయకులు కె.చంద్రశేఖర రావు, రాము, రాజు, అన్నపూర్ణ, ఎర్రి బాబు, తదితరులు పాల్గొన్నారు.



భూములను పరిశీలిస్తున్న జయరాం

రైతులకు న్యాయం చేస్తాం : ఆర్‌డిఓ

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం గొలుగొండ గ్రామ పంచాయతీకి చెందిన రెల్లి జాతికి చెందిన రైతులకు న్యాయం చేస్తామని నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరాం స్పష్టం చేశారు. 1989 సంవత్సరం నుండి రెల్లి దళితులు సాగు చేసి వ్యవసాయం చేసుకుంటూ బతుకున్న సుమారు 40 కుటుంబాలకు పట్టాలు, కోల్పోయిన భూమికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద జనసేన ఆధ్వర్యంలో ఆందోళన చేసిన నేపథ్యంలో స్పందించిన ఆర్డీవో శనివారం రెల్లి దళితుల సాగు భూములను జనసేన ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర, ఇతర నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, రెల్లి, దళితులకు ఎటువంటి అన్యాయం జరగకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్య పడవద్దని తప్పనిసరిగా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహశీల్దార్ జి.ఆనందరావు, గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు(బుజ్జి), మండల జనసేన అధ్యక్షులు గండెం దొరబాబు, డాక్టర్ నారాయణరావు, బోయిన చిరంజీవి, వాసం వెంకటేష్, మాకిరెడ్డి వెంకటరమణ, కొండలరావు, గొలుగొండ ఎంపిటిసి అభ్యర్థి బాలకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివశంకర్

సొంత భూమిలో ఇల్లు కట్టుకుంటే దౌర్జన్యమా

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని ఖండివరం బాధితులకు న్యాయం జరగకపోతే సహించేది లేదని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్, రాష్ట్ర పర్యావరణ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ హెచ్చరించారు. శనివారం చీడికాడ మండలంలోని ఖండి వరం గ్రామంలో బోయిదాపు వెంకటరమణ పై బందారు అచ్చిబాబు చేసిన దాడిని ఖండిస్తూ బాధితులను పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జనసేన ఐటీ సెల్ ఉన్న బోయిదాపు కిరణ్ కుమార్ తండ్రి బోయిదాపు వెంకటరమణ ఇల్లు నిర్మాణ పనులు చేపడుతుండగా పక్క స్థలంలో గల వ్యక్తి దాడి చేయడమే కాకుండా చంపేందుకు ప్రయత్నించారన్నారు. బోయిదాపు వెంకటరమణ కొనుగోలు చేసిన సొంత భూమిలో ఇల్లు కట్టుకుంటుంటే సంబంధం లేని వ్యక్తి దాడి చేయడమే కాకుండా గ్రామ వైసీపీ నాయకుల అండతో బాధితుడి పై కేసు నమోదు చేయడం సమంజసం కాదన్నారు.పోలీసులు న్యాయ బద్ధంగా కేసులు నమోదు చేయాలని తెలిపారు.

మహిళ ఫిర్యాదు

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట గ్రామానికి చెందిన మల్లేటి రమణపై అదే గ్రామానికి చెందిన గరగా సత్యవతి రావికమతం పోలీసులకు శనివారం సాయంత్రం పిర్యాదు చేసింది. తన ఇంటి పక్కన సెంటు పావు నివాశ స్థలాన్ని ఇదే గ్రామానికి చెందిన మరువాడ అర్జున వద్ద 19 ఏళ్ల క్రితం తన భర్త మాణిక్యం కొనుగోలు చేశారని, తదనంతరం కొనుగోలు చేసిన తన భర్త, అమ్మిన మరువాడ అర్జున మృతి చెందగా ఆ స్థలం అప్పటి నుంచి తన స్వాధీనంలో ఉందని ఆ స్థలాన్ని తన కుటుంబ అవసరం నిమిత్తం దొండపూడి గ్రామానికి చెందిన వ్యక్తికి విక్రయించు కొనగా ఇంత వరకూ వారి స్వాధీనంలో ఉందని తెలిపింది.19 ఏళ్ళ అనంతరం మల్లేటి రమణ ప్రోత్సాహంతో మరువాడ సత్యనారాయణ (సత్యం) వచ్చి స్థలం తమది అంటూ గొడవ చేయడంతో పాటు అధికార్లకు తప్పుడు పిర్యాదు చేస్తున్నారని ఆమె వాపోయింది. ఈ సమస్య పై రావికమతం తహసీల్దార్ మహేశ్వరరావు వద్ద విచారణకు హాజరై వస్తుండగా మల్లేటి రమణ తనపై దురుసుగా ప్రవర్తించి అసహ్యంగా తిట్టాదని, అట్రాసిటీ కేసు పెట్టిస్తానని బెదిరించాడని అతనిపై చర్యలు తీసుకుని తనకు రక్షణ కల్పించాలని మహిళ పిర్యాదు చేసింది. దీనిపై ఎస్ఐ ఉమా మహేశ్వరరా వును సంప్రదించగా పిర్యాదు అందిందని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జగనన్న కాలనీల పరిశీలన

ప్రజాశక్తి-రోలుగుంట:జగనన్న కాలనీ లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని ఎంపిడిఒ కె.ప్రభాకరరావు సూచించారు. శనివారం మండల కేంద్రమైన రోలుగుంట గ్రామంలోని జగనన్న కాలనీలను ఆయన సందర్శించారు. బోరు వేయించి మోటారు బిగించలేదని లబ్ధిదారులు తెలిపారు. మోటారు వేయించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ పోతల శ్రీనివాసరావు, హౌసింగ్ ఎఇ ప్రేమానందం, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోటవురట్ల: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ సూచించారు. లింగాపురం గ్రామంలో జగనన్న కాలనీ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మిస్తున్న కాలనీ ఇల్లు వివరాలు గృహ నిర్మాణశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించాలని, వారికి అవసరమైన గృహ నిర్మాణ సామగ్రి, మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

మినీ గోకులం నిధులపై విచారణ

ప్రజాశక్తి- కోటవురట్ల:రాజుపేట గ్రామంలో మినీ గోకులం నిధులు సాయి బాలాజీ కంపెనీ ప్రతినిధి స్వాహా చేశారంటూ వచ్చిన ఫిర్యాదుపై శనివారం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సింహాద్రిప్పడు శనివారం గ్రామంలో గ్రామ సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ సమక్షాన విచారణ చేపట్టారు.ఈ విషయంపై సహాయ సంచాలకులను వివరణ కోరగా... గత ప్రభుత్వంలో మంజూరు చేసిన మినీ గోకులం షెడ్ల నిర్మాణం మండల వ్యాప్తంగా 276 మంజూరు అయ్యాయని. వాటిలో కొన్ని షెడ్లు పూర్తి కాగా 232 వివిధ దశలో ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం జమ చేసిన నిధులు కొన్ని షెడ్లకు సంబంధించి సాయి బాలాజీ కంపెనీలో ప్రభుత్వం మంజూరు చేయడం వాస్తవమేనని వాటిపై సమగ్ర విచారణ చేపట్టి జిల్లా స్థాయి అధికారులకు నివేదిక పంపుతామని రైతులకు తగు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అన్నారు. ఇదిలా ఉండగా 2018-19 సంవత్సరంలో మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి 10శాతం రైతు వాటాతో గ్రామంలో 39 మంది రైతులకు మంజూరు కాగా కేవలం 2 షెడ్ల నిర్మాణం మాత్రమే సాయి బాలాజీ కంపెనీ నిర్మాణం చేపట్టింది. మిగతా 37 మంది రైతులు స్వయంగా షెడ్లు నిర్మాణం చేపట్టుకోగా పది మంది రైతులకు మాత్రమే తమ ఖాతాలో ప్రభుత్వం నిధులు జమ చేసింది. మిగతా 27 మంది రైతుల నిధులు సాయి బాలాజీ కంపెనీ ఖాతాలో జమ చేసుకుని స్వాహా చేశారంటూ రైతులు గడిచిన ఏడాదికాలంగా మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించి విచారణ చేపట్టారు.



విచారణ చేపడుతున్న సింహాద్రిప్పడు